# కోడ్ ముగియగానే ..బదలీలు ..!

-విద్యుత్‌శాఖలో ఏఈ నుంచి సీజీఎంల వరకు భారీగా మార్పులు
-సర్కిళ్ల వారీగా జాబితా సిద్ధం చేస్తున్న ఉన్నతాధికారులు
-ఫోకల్ స్థానాలు దక్కించుకునేందుకు పలువురు ప్రయత్నాలు
-మంత్రులు, ఉన్నతాధికారులను కలుస్తున్న యూనియన్ నేతలు
-గ్రేటర్‌లోనివారిని జిల్లాలకు ... జిల్లాల నుంచి ఇక్కడికి మార్చే అవకాశం




**హైదరాబాద్, మే 28,ప్రభాతవార్త:**
విద్యుత్‌శాఖలో ఉదో ్యగబదిలీల ప్రక్రియపై డిస్కం దృష్టి సారించింది. ఎన్నికల కోడ్ ముగియగానే భారీగా బదిలీలు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. డివిజన్, సర్కిళ్ల వారీగా ఒకే స్థానంలో ఏళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులు మూడేళ్ల దాటివారి జాబితాను సిద్ధం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రేటర్ జోన్‌లోని సైబర్‌సిటీ, మేడ్చల్, రాజేంద్రనగర్, హైదరాబాద్ సౌత్, సెంట్రల్, సికింద్రాబాద్ సర్కిళ్ల పరిధిలో భారీగా ఉద్యోగ బదిలీలు జరిగే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. దీంతో కొంతమందిఅసోషియేషన్లు, యూనియన్ నాయకులు తమకు సంబంధించిన ఉద్యోగులకు తాము సూచించిన ప్రాంతాల్లో పోస్టింగ్‌లు కల్పించాలంటూ ఉన్నతాధికారులపై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేస్తున్నారు. అందుకు తమకు అనుకూలమైన మంత్రులు, ఉన్నతాధికారులను కలుస్తూ వారిని ప్రసన్నం చేసుకునే పనిలోపడ్డారు. ముఖ్యంగా ఇప్పటికే ఫోకల్ (ఎక్కువ ఆదాయం) ప్రాంతాల్లో పనిచేస్తున్న యూనియన్ నేతలు అక్కడి నుంచి బదిలీ కాకుండా ఉండేందుకు ప్రభుత్వ పెద్దలను కలుస్తున్నారు. అలాగే ఇప్పటివరకు జిహెచ్‌ఎంసి పరిధిలోకి రాలేకపోయిన ఉద్యోగులు, ఇంజనీర్లు ఈప్రభుత్వంలోనైనా ,గ్రేటర్ పరిధిలో పోస్టింగ్ దక్కించుకోవాలని తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారు. దీంతో మింట్‌కాంపౌండ్‌లోని యూనియన్, అసోషియేషన్ల కార్యాలయాలల్లో జిల్లాలనుంచి వచ్చే ఉద్యోగులు,నాయకులతో సందడిగా మారుతునా న్నయి.

**ఉద్యోగుల పనితీరుపై అసంతృప్తి..**
నగరంలోని పలు సర్కిళ్లు, డివిజన్లలో పనిచేస్తున్న ఉద్యోగుల పనితీరుపై ప్రభుత్వం అసంతృప్తితో ఉంది. ఉద్యోగుల పనితీరు సరిగ్గా లేకుంటే చర్యలు తీసుకుంటామని సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి భట్టివిక్రమార్క ఇప్పటికే పలుసార్లు హెచ్చరించారు. నిరంతర విద్యుత్ కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నా గత ప్రభుత్వంతో సత్సంబంధాలు కలిగిన పలువురు ఇంజనీర్లు, యూనియన్ నాయకులు తమ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని గుర్తించారు. తాము ఎన్నిసార్లు హెచ్చరించినా వారితీరు మారకపోవడంతో ఎలాగైనా వారికి స్థాన చలనం జరిపించాలని నిర్ణయించినట్లు తెలుస్తుంది. డిస్కంలో కొంతమంది అధికారులు ఒకే సర్కిల్, ఒకే డివిజన్‌లో విధులు నిర్వహిస్తూ చక్రం తిప్పుతున్నారనే విమర్శలు సైతం ఉన్నాయి. మేడ్చల్ సర్కిల్ పరిధిలోని ఓడివిజన్‌లో గత నెలలో ఓడిఈ పదవి విరమణ చేయగా, ఆస్థానంలో సిజిఎం ఎస్‌ఈ కార్యాలయంలో పనిచేసే అధికారికే ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించడంపై పలువిమర్శలు వ్యక్తమయ్యాయి. అలాగే రాజేంద్రనగర్, సైబర్‌సిటీ పరిధిలోనూ పలువురు అధికారులు యూనియన్ల అండదండలతో భారీగా అవినీతికి పాల్పడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**గ్రేటర్‌నుంచి జిల్లాలకు ...అక్కడి నుంచి ఇక్కడికి**
గ్రేటర్‌లో భారీగా బదిలీలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఉద్యోగుల పనితీరుదృష్టిలో పెట్టుకుని జిల్లాల నుంచి గ్రేటర్‌కు, గ్రేటర్‌లో పనిచేస్తున్న అధికారులకు జిల్లాకు బదిలీలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. శివారుప్రాంతాల్లో పనిచేస్తున్న కొంతమంది అధికారులపై తరుచూ ఫిర్యాదులు అందుతుండటంతో వారిని పూర్తిస్థాయిలో స్థానచలనం చేయాలని డిస్కం అధికారులు భావిస్తున్నారు. అలాగే టిఎస్‌ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఉద్యోగులను బదిలీ చేసేలా కసరత్తు చేస్తున్నారు. దీంతో ఓఅండ్‌ఎం సిబ్బంది, సబ్ ఇంజనీర్లు, సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న సూపరింటెంట్ ఇంజనీర్లను ఇతర సర్కిల్ పరిధిలోకిబదిలీలు చేసే అవకాశాలున్నాయి.. అయితే నగరంలో విద్యుత్‌పంపిణీ వ్యవస్థ... గ్రామాల్లో పంపిణీ వ్యవస్థకు తేడా ఉండటంతో ఒక్కసారిగా జిల్లాలనుంచి గ్రేటర్ జోన్‌కు ఉద్యోగులను బదిలీ చేస్తే ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నాయని సీనియర్ అధికారులు తెలుపుతున్నారు. యూనియన్లు, అసోషియేషన్ల ప్రాధాన్యం లేకుండా సీనియార్టీ ఉద్యోగుల పనితీరు ఆధారంగా బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని సూచిస్తున్నారు.

# హైదరాబాద్ వార్త



# ధరల దడ..!



## -మండిపోతున్న కూరగాయలు

**హైదరాబాద్, మే 28 ప్రభాతవార్త**
కూరగాయల ధరలు మండిపోతున్నాయి. కూరగాయల ఉత్పత్తి బాగా తగ్గడంతో కాయగూరల ధరలు మండుతున్నాయి. మార్కెట్‌లో కూరగాయలు సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోయాయి. రైతు బజార్లు, వారాంతపు సంత, కూరగాయల మార్కెట్.. ఎక్కడ చూసినా ధరల మోతే. ఏ కూరగాయ చూసినా పావుకేజీ ధర రూ.20లు నుంచి రూ. 25లు పలుకుతోంది. సాగు నీరు అందుబాటులో ఉన్న రోజుల్లో కిలో కూరగాయలు రూ.20లు నుంచి రూ.40లు వరకు లభించేవి. ప్రస్తుత హోల్‌సేల్ మార్కెట్‌లో రూ.20లు నుంచి రూ.25లు వరకు ధర పలుకుతుండగా వారాంతపు సంతల్లో కిలో రూ.60లు-రూ120లు పలుకుతున్నాయి.

నగరంలో సుమారు 1.5 కోట్ల మంది ప్రజలు నివసిస్తున్నారు. స్థానిక ప్రజల అవసరాలకు ఏడాదికి సుమారు 40 లక్షల మెట్రిక్ టన్నుల కూరగాయలు అవసరం ఉంటాయని అంచనా. నగర పరిసర ప్రాంతాలైన వికారాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్, మెదక్ ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి కూరగాయలు వస్తున్నాయి. స్థానికంగా సుమారు 19 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 25 మెట్రిక్ టన్నులు వరకు కూరగాయలు అందుబాటులో ఉంటున్నాయని అంచనా వేస్తున్నారు. ఆపై అవసరాలకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలపై ఆధారపడాల్సి వస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో సాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. దీంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. ఫలితంగా ఇతర రాష్ట్రాల కూరగాయలే దిక్కవుతున్నాయి. కూరగాయల దిగుమతికి రవాణా చార్జీలు, లోడింగ్, అన్‌లోడింగ్, మార్కెటట్ ఫీజులు, ఇతర ఖర్చులు కలిపి తడిపి మోపెడు అవుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఫలితంగా నెల రోజుల క్రితం టమోటా కిలో రూ. 20 ఉంటే ప్రస్తుతం రూ. 50 చేరింది. గతంలో పచ్చిమిర్చీ కిలో రూ. 60 ఉండగా ఇప్పుడు రూ. 120కి పెరిగింది.పావు కిలో రూ. 20కి అమ్ముతున్నారు.వారపు సంతలో కూరగాయలు ఏవి అడిగినా పావుకిలో రూ. 20 నుంచి రూ. 25 చెబుతున్నారు. నెల క్రితం వరకు కిలో టమాటా రూ. 20 ఉండేది. ప్రస్తుతం కిలో రూ. 60 అమ్ముతున్నారు. పచ్చిమిర్చీ పావుకిలో రూ. 20కి దొరికేది. ప్రస్తుతం రూ. 40కి అమ్ముతున్నారు. ఇలా అన్ని ధరలు పెరగడంతో తక్కువ కూరగాయలు కొనుగోలు చేస్తున్నారు.

మార్కెట్లో వీటి ధరల బోర్డును చూసిన జనం బెంబేలెత్తిపోతున్నారు. ఇలా అయితే కూరగాయలు కొనేది ఎలా అంటూ వాపోతున్నారు. అసలే పన్నుల భారం, దీనికి తోడు పెట్రోల్ ధరలతో పాటు కూరగాయలు,ఆకుకూరలు కూడా వాతపెట్టడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. టమాటా,ఉల్లిగడ్డ డిమాండ్‌కు తగినట్లు సరఫరా లేకపోవడంతో ధర పెరిగిపోతోందని వ్యాపారులు చెబుతున్నారు. కొత్త పంట చేతికి రావడానికి మరో రెండు నెలలు పడుతుందని అప్పటి వరకు ధర పెంపు తప్పదని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.స్థానిక వ్యాపారులు ఎక్కువగా చిత్తూరు జిల్లా మదనపల్లి, కర్ణాటకలోని కొలార్, చిక్‌మంగళూర్‌లపై ఆధారపడి అక్కడి నుంచి దిగుమతి చేసుకుంటారు. అయితే అక్కడ పంట సాగు పూర్తిగా తగ్గిపోయింది. ఇక మన రాష్ట్రంలో పంట సాగు తక్కువగా ఉంది. అది కూడా మెదక్, సిద్దిపేట, వికారాబాద్ జిల్లాలో మాత్రమే టమాటా సాగవుతోంది. ఈ జిల్లాల నుంచి హైదరాబాద్ మార్కెట్లకు రోజుకు సుమారు 600-800 క్వింటాళ్ల మేర టమాట వస్తుంది. అయితే ఒక్క హైదరాబాద్ దినసరి టమాటా వినియోగం సగటున 5వేల క్వింటాళ్ల నుంచి 6వేల క్వింటాళ్లు ఉంటుంది. దీంతో డిమాండ్‌కు తగినట్లు సరఫరా లేకపోవడంతో ధరలు పెంచుతున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయల ధరలు తగ్గించేందుకు ప్రభుత్వం, సంబంధిత అధికారులు తగిన చొరవ తీసుకోవాలంటున్నారు.

# నగర శివారుల్లో వరుస రియల్‌ఎస్టేట్ మోసాలు

## -అమీన్ పురా, బందనకొమ్ము ప్రాంతాల్లో మరోసారి -తెలివి మీరిన అక్రమార్కులు కోట్లు కొల్లగొట్టారు

**హైదరాబాద్, మే27, ప్రభాతవార్త:**
నగరంలో వరుస రియలెస్టేట్ మోసాలతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. భూవిక్రయాల్లో వివిధ రకాలుగా మోసాలకు పాల్పడే నేపథ్యంలో, ఇటీవలె జరిగిన ఘటనలో ఏళ్ళనాటి పాత భూముల నిజమైన యజమానులకు బదులు నకిలీ మనుషులను పురమాయించి డూప్లికేట్ ఆధారాలతో ప్లాట్లను విక్రయించి అడ్డదారిలో దోచుకున్నారు. తాజాగా ఫ్రీలాంచ్ పేరుతో వేల మందిని మోసం చేసి కోట్లు కొల్లగొట్టిన వైనం ఒకే వారంలో రెండు సార్లు చోటు చేసుకుంది. అందులోని ఒక ఘటనలో ఫ్రీలాంచింగ్ పేరుతో దాదాపు 2వేల మందిని పైగా మోసం చేసి రూ.1,500కోట్లు దోచేసిన సాహితీ ఇన్‌ఫ్రాటెక్ సంస్థ బోర్డు తిప్పేసింది. దాంతో బాధితులు బషీర్‌బాగ్ సీసీఎస్ ఆఫీసు ముందు ఆందోళనకు దిగి తమ గోడు పోలీసులకు వినిపించారు. ఈ భారీ మోసాన్ని నగర ప్రజలు మరువకముందే, అది జరిగిన వారం లోపే మరో ఫ్రీలాంచ్ మోసం వెలుగులోకి వచ్చింది. గ్రీన్ మెట్రో ఇన్‌ఫ్రాటెక్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ పేరుతో బాధితుల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసిన భోగస్ సంస్థ మూడోకంటికి తెలియకుండా మాయమైంది. వరుసగా జరిగిన ఈ రియలెస్టేట్ మోసాలు నగర శివారుల్లో అమీన్ పురా, బంధన కొమ్ము పరిసరాల్లోనే జరగడం గమనార్హం.

**తెలివిమీరిన అక్రమార్కులు:**
రిజిస్టర్ కార్యాలయం వారి నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకుని తెలివిమీరిన అక్రమార్కులు చాపకింద నీరులా వ్యవహరిస్తూ కోట్లు విలువ చేసే భూములను నకిలీ ఆధారాలతో అమ్మేసిన వైనం ఇటీవలె చోటు చేసుకుంది. తెలంగాణలో భూముల విలువ పెరిగిన నేపథ్యంలో అమీన్ పురా, బందనకొమ్ము, రామేశ్వరం బండ ప్రాంతంలో ఖాళీగా ఉన్న ప్లాట్లను గుర్తించిన అక్రమార్కులు, వాటి యజమానులు ఎవరో తెలుసుకుని వారి పేరుతో నకిలీ ఆధార్ కార్డులనూ, నకిలీ పత్రాలనూ, నకిలీ వంశస్థులనూ సృష్టించి స్థలాలను కాజేసి డబ్బు చేసుకుంటున్నారు. నగరానికి చెందిన రియలెస్టేట్ వ్యాపారులు బండి దుర్గాప్రసాద్, సుబ్బారావు, రవీ గౌడ్‌లు ముఠాగా ఏర్పడ్డారు. వీరిలో ఇద్దరు అమీన్‌పురా పోలీస్ స్టేషన్ పరిధిలో గత 20 నుండి 25 సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న ప్లాట్లను రెక్కీ వేసి మరీ గుర్తించి, ఆ భూముల అసల యజమానుల వివరాలను పకడ్బందీగా తెలుసుకున్నారు. అనంతరం ముఠాలో మరొక సభ్యుడికి సమాచారం అందించడంతో అతడు రంగంలోకి దిగి, నకిలీ యజమానితో పాటు నకిలీ వంశస్థులను సిద్ధం చేశాడు. అమాయక ప్రజలకు డబ్బాశ చూపించి, వారిని నకిలీ మనుషులుగా నటించమని చెప్పిన రోజు రిజిస్ట్రేషన్ ఆఫీసుకు వచ్చి సంతకాలు చేయాలని ఒప్పించి నియమించారు. అసలు యజమాని పేరు మీద నకిలీ ఆధార్ కార్డు, నకిలీ సేల్ డీడ్, లింక్ డాక్యుమెంట్లను తయారు చేసి ఆ స్థలాలు అమ్ముతూ అడ్డగోలుగా సంపాదించారు. ఒక్కో ప్లాట్ విలువా కోట్లలో ఉంటుందని పోలీసు లు చెబుతున్నారు. ఇలా దాదాపు 15 నుంచి 20 ప్లాట్ల వరకూ ఈ ముఠా అమ్మేశారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడ్డ పోలీసులు వీరిపై నిఘా వేసి అరెస్ట్ చేశారు.

**తక్కువ ధరకు ప్లాట్ల పేరుతో మోసం:**
ఫ్రీలాంచ్ పేరుతో తక్కువ ధరకు ప్లాట్లు ఇస్తామంటూ దాదాపు 2వేల మందిని మభ్యపెట్టిందో రియలెస్టేట్ సంస్థ. సంగారెడ్డి జిల్లా అమీన్ పురా ప్రాంతంలో సాహితీ శర్వాణీ ఎలైట్ పేరుతో 25 ఎకరాల్లో 32 అంతస్తులతో 10 టవర్లు నిర్మిస్తామని చెప్పి రెండు వేల మంది సామాన్యుల వద్ద సుమారు రూ1,500 కోట్లు వసూలు చేసి మాయమైంది. ఫ్రీలాంచ్ ఆఫర్‌తో తక్కువ ధరకు ప్లాట్లు ఇస్తామని చెప్పడంతో ఎంతో మంది ఎగబడడంతో సంస్థను అడ్డు పెట్టుకున్న అక్రమార్కులు డబ్బులు కట్టించుకుని ఉడాయించారు. ఈ మేరకు బషీర్‌బాగ్ సీసీఎస్ కార్యాలయం ముందు భారీగా మోహరించిన బాధితులు పోలీసులకు తమ గోడు వెళ్ళగక్కుకున్నారు. నిందితుల ఫొటోలను ప్లకార్డులకూ, ఫ్లెక్సీలకూ ప్రింట్ చేయించి ఆందోళనకుదిగారు. ఆది జరిగిన దాదాపు తక్కువ వ్యవధిలోనే మరో ఫ్రీలాంచ్ మోసం వెలుగులోకి వచ్చింది. గ్రీన్ మెట్రో ఇన్‌ఫ్రాటెక్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ పేరుతో బాధితుల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసిన భోగస్ సంస్థ మూడోకంటికి తెలియకుండా మాయమైంది. ఎటువంటి రిజిస్ట్రేషన్ చేయకుండా సదరు కంపెనీ మోసం చేసిందని సీసీఎస్ ప్రధాన కార్యాలయం ముందు బాధితులు వాపోయారు. ఇటువంటి రియలెస్టేట్ మోసాలు అధికమవ్వడంతో అప్రమత్తమైన పోలీసులు అక్రమార్కులను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పోలీసుల ఆదేశాల మేరకు రిజిస్టర్ కార్యాలయ అధికారులు స్థలాల రిజిస్ట్రేషన్ విషయాల్లో అప్రమత్తమయ్యారు.

# హద్దులు దాటిన ఇద్దరి అవినీతి..!

**హైదరాబాద్, మే 28 ప్రభాతవార్త :**
విద్యుత్ శాఖ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కందుకూర్, రాజేంద్రనగర్ డీఇ కార్యాలయాలతోపాటు ఏడీఇ, ఏఇల కార్యాలయాల్లో అవినీతి రాజ్యమేలుతోంది. డీఇ కార్యాలయాల్లో కీలక బాధ్యతల్ని నిర్వహిస్తోన్న ఆ ఇద్దరు అధికారుల అవినీతి, అక్రమ వసూళ్ళు హద్దులు దాటినా ఓ వైపు విజిలెన్స్, అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దృష్టి సారించకపోవడంతో తమకు అడ్డే లేదన్న ధీమాతో సదరు అధికారులు మామూళ్ళ కోసం రెచ్చిపోతున్నారు. డీఇ, ఏడీఇ, ఏఇల కార్యాలయాల్లో కొందరు అధికారులు ట్రాన్స్‌ఫార్మర్, కనెక్షన్లు, ప్యానల్ బోర్డుల స్విచ్‌గేర్లు, ఎర్తల మంజూరుకు గాను పెద్దమొత్తంలో మామూళ్ళను వసూలు చేస్తున్నారు. కనెక్షన్ల ఎస్టిమేషన్లలో కొందరు ఏడీఇలు, ఏఇలు కొందరు కీలక అధికారులు గోల్‌మాల్ చేసి పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు తెలిసింది. కొత్తగా విద్యుత్ కనెక్షన్లు, వ్యాపార, వాణిజ్య కనెక్షన్లు అధికారులకు కాసులు కురిపిస్తున్నాయి. కొత్తగా విద్యుత్ కనెక్షన్ జారీచేయడంలో జరుగుతున్న అక్రమాలు అంత ఇంతా కావు. ఇక కొత్త కనెక్షన్లకు మరింత గిరాకీ పెరుగుతుంది. అధికారుల వేదింపులు అంతా ఇంతా కావు. అడిగినంత ఇస్తే తప్ప ఎవరు చెప్పినా కొత్త కనెక్షన్ ఇచ్చే పరిస్థితి లేదంటే చెబుతున్నారు. శివార్లలో బహుళంతస్తుల భవనాలతోపాటు వ్యక్తిగత గృహాలు, కమర్షియల్ భవనాలు, విల్లాలు పెద్దఎత్తున వెలుస్తున్నాయి. పెద్దఎత్తున వెలుస్తున్న నిర్మాణాలు అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్నాయి. బహుళ అంతస్తుల భవనాలను బట్టి మామూళ్ళను నిర్ణయిస్తున్నారు. భవనాలు, అపార్ట్‌మెంట్లలో 4మీటర్లు దాటితే ప్యానల్ బోర్డు తప్పక ఏర్పాటు చేసుకోవాలి. ప్యానల్ బోర్డు లేకున్నా మామూళ్ళు తీసుకుని మీటర్లు కేటాయించేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకున్న చందంగా కొందరు అధికారులు, సిబ్బంది ప్యానల్ బోర్డు పేరు చెప్పి విద్యుత్ మీటర్ల జారీలో తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఉదాహరణకు ఒక ప్రాంతంలోని ఓ భవనంలో నాలుగుకు మించి మీటర్లు ఉన్నట్లైతే ప్యానల్ బోర్డును ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అయితే వాస్తవానికి ప్యానల్ బోర్డు ఏర్పాటు వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయి. ప్యానల్ బోర్డు లేకపోవడం వల్ల మీటర్ రీడింగ్ తీసే సిబ్బ ందికి అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో పాటు ప్రమాదాలు జరుగకుండా ఉంటుంది. ఈ నిబంధనల్ని ఖచ్చితంగా అమలు చేస్తే బాగుంటుంది. కాని దీన్ని బూచిగా చూపిస్తూ కొందరు మీటర్ల జారీలో అందినంత దండుకుంటున్నారు. ప్యానల్ బోర్డుల పేరిట కొందరు అధికారులు, సిబ్బంది పెద్ద మొత్తంలో లంచాలను దండుకుంటున్నారు. నాలుగు మీటర్లకు మించితే కనెక్షన్లకు సంబంధించి ప్యానల్ బోర్డు ఏర్పాటు తప్పనిసరి అని పేర్కొంటున్న అధికారులు కొందరికి మాత్రమే ఈ నిబంధనల్ని వర్తింపచేయడం బట్టి చూస్తే కొందరు అధికారులు, సిబ్బంది మామూళ్ళ కోసమే ఈ విధంగా వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలుస్తుంది. మామూళ్ళు ముట్టచెబితే వారికి మాత్రం ఈ నిబంధన వర్తింపచేయడంలేదు. మామూళ్ళు ఇవ్వని వారికి మాత్రం ప్యానల్ బోర్డును ఏర్పాటు చేసుకుంటేనే కనెక్షన్ ఇస్తామని చెబుతున్నారు. ఇదిలా ఉండగా డీఇలు, ఏడీఇలు, ఏఇలు తనిఖీలు, సమావేశాల పేరుతో కార్యాలయాలకు ఎప్పుడు వస్తున్నారో ఎప్పుడు పోతున్నారో తెలియని పరిస్థితి. దీంతో కార్యాలయాలకు వినియోగదారులు వస్తే అధికారులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మరుసటి రోజు వచ్చిన వారికి అధికారులు సకాలంలో కలవడానికి సమయం ఇవ్వకపోవడంతో వినియోగదారులకు నిరీక్షణ తప్పడంలేదు. పెరిగిన విద్యుత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేయడంలో కొందరు అధికారులు నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే పెరిగిన విద్యుత్ కనెక్షన్లను దృష్టిలో పెట్టుకుని కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా అధికారులు వ్యవహరిస్తుడడంతో విద్యుత్ సమస్యలు అంతకంతకు పెరుగుతున్నాయి. ఎంత సేపు వ్యక్తిగత గృహాలు, అపార్ట్‌మెంట్లకు సంబంధించిన కొత్త కనెక్షన్ల మంజూరులో కొందరు ఏడీఇ, ఏఇలు లంచాలను దండుకుంటూ యమబిజీగా ఉంటూ విద్యుత్ వినియోగదారుల సమస్యలను పట్టించుకోవడంలేదు. ట్రాన్స్‌ఫార్మర్లలో సాంకేతిక సమస్యలు తలెత్తినా, ఫీడర్లు ట్రిప్పయినా క్షేత్రస్థాయి సిబ్బంది స్పందించకపోవడంతో సరఫరాలో అంతరయాలు ఏర్పడుతున్నాయి. ఇక రాత్రి వేళల్లో కరెంట్ పోయిందంటే సకాలంలో కరెంట్ రావడం లేదు. కరెంట్ సరఫరాలో కొందరు అధికారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో వినియోగదారులు నిత్యం అనేక అవస్థలకు గురవుతున్నారు. వ్యాపార సముదాయాలకు ఓ విధంగా డొమెస్టిక్ వినియోగదారులకు మరో విధంగా సరఫరా చేస్తూ విద్యుత్ అధికారులు తమ ధ్వందనీతిని ప్రదర్శిస్తున్నారు. అనేక ప్రాంతాల్లో కరెంట్ హై,లో ఓల్టేజీలతో కరెంట్ సరఫరా అవుతుండడంతో విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోతున్నాయి. ఇంట్లోని టీవీలు, ల్యాప్‌ట్యాప్‌లు, కంప్యూటర్లు కాలిపోతున్నాయి. అనేక ప్రాం తాల్లో ఎన్నో ఏళ్ళ క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లు నేటికి దర్శనమి స్తున్నాయి. ప్రజల ప్రాణాలకు పెను ముప్పుగా మారినప్పటికీ మామూళ్ళపైనే ధ్యాస తప్ప ఈ సమస్యను పట్టించుకోవడంలేదని పలువురు వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

**హద్దులు దాటిన ఓ ఇద్దరి అవినీతి..**
రాజేంద్రనగర్, కందుకూర్ డీఇ కార్యాలయాల్లో కీలక బాధ్యతల్ని నిర్వహిస్తున్న ఓ ఇద్దరు అధికారులు అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారారు. అక్రమ సంపాదనకు అలవాటుపడిన సదరు అధికారులు డీఇ కార్యాలయాల్లో తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో పనిచేసిన ప్రతి చోట కూడా ఇలాగే వ్యవహరించినట్లు సదరు అధికారులపై విమర్శలు ఉన్నాయి. ఫైళ్ళను సకాలంలో క్లియర్ చేయకపోవడంతోపాటు పాలన గాడితప్పినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొందరు అధికారులు వినియోగదారులను దోచుకోవడమే త మ విధి అన్నట్లుగా ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారని బాహాటంగానే విమర్శ లు వినిపిస్తున్నాయి. డీఇ కార్యాలయాలతోపాటు ఏడీఇ, ఏఇ కార్యాలయాల్లో పనిచేసే పై స్థాయి నుంచి కిందిస్థాయి వరకు రూ.కోట్ల మేర అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు వసూలు చేస్తున ్న అవినీతి సొమ్మును అంతా కలిసి పంచుకుంటున్నట్లు తెలిసింది. డీఇ కార్యాలయాల్లో కీలక బాధ్యతల్ని నిర్వహిస్తోన్న అధికారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

# రోడ్డుపై పారుతున్న డ్రైనేజీ నీరు

-కంపుకొడుతున్న పట్టించుకోని జిహెచ్‌ఎంసి అధికారులు
-నెల రోజుల నుండి పారుతున్న వైనం



**అత్తాపూర్ మే28,ప్రభాతవార్త :**
రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో డ్రైనేజీ ,పరిసరాల పరిశుభ్రతకు ఎంతో కృషి చేస్తున్నామని జిహెచ్‌ఎంసి అధికారులు గొప్పులు చెప్పుకుంటున్నప్పటికి వాస్తావానికి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. అరంఘర్ చౌరస్తా నుండి మోహిదిపట్నం వెళ్లె మార్గంలోని పిల్లర్ నెంబర్ 251 దగ్గర గత కొన్ని రోజులుగా డ్రైనేజీ నాలా నిండి రోడ్డుపై పారుతున్న జిహెచ్‌ఎంసి అధికారులు పట్టించుకోవడం లేదు.వివిధ కాలనీల నుండి ప్రవహించే నాలా చెత్తచెదారంతో నిండి డ్రైనేజీ నీరు రోడ్డుపై ప్రవహిస్తూ వాగును తలపిస్తుంది. అయిన అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదు.దీంతో రోడ్డుపై డ్రైనేజీ నీరు నిలిచిపోయి. కంపు కోడుతుండడంతో అటు వైపు ప్రయాణాలు సాగించే వాహనదారులు ముక్కు మూసుకొని ప్రయాణం సాగిస్తున్న పరిస్థితి నెలకొంది.సంబంధిత అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ నాలాను క్లీయర్ చేయించి డ్రైనేజీ నిరు సాఫీగా వెళ్లే విధంగా చూడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## బసవతారకంలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

**-నివాళులర్పించిన చైర్మన్ నందమూరి బాలకృష్ణ**



తల్లిదండ్రులు ఎన్టీఆర్-బసవతారకం విగ్రహాలకు నివాళ్లు అర్పిస్తున్న చైర్మన్ బాలకృష్ణ

**హైదరాబాద్, మే 28,ప్రభాతవార్త:**
స్వర్గీయ నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్) 101 జయంతిని పురస్కరించుకుని మంగళవారం బసవతారకం ఇండోఅమెరికన్ ఆసుపత్రిలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి చైర్మన్ నందమూరి బాలకృష్ణ హాజరై హాస్పిటల్ ఆవరణలోని తమ తల్లిదండ్రుల విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం హాస్పిటల్‌లో క్యాన్సర్‌పై పోరాడుతూ చికిత్స పొందుతున్న చిన్నారులకు పండ్లు, బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా బసవతారకం ఆసుపత్రి ముందుకు సాగుతుందన్నారు. ఎందో పేదలకు క్యాన్సర్‌పై పోరాటంలో బాసటగా నిలుస్తుందన్నారు. తన తల్లిదండ్రులు ఆశించినట్లు అందుబాటైన ధరలలో ప్రపంచస్థాయి క్యాన్సర్ చికిత్స అందిచడంలో దేశంలోనే ముందంజలో ఉందన్నారు. ఈకార్యక్రమంలో బోర్డు సభ్యులు ఎంపి నామానాగేశ్వర్‌రావు, జెఎస్ ఆర్ ప్రసాద్, మెడికల్ డైరెక్టర్ డా.టిఎస్‌రావు, మెడికల్ సూపరిండెంట్ డా.ఫణికోటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## ఉరివేసుకుని సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య

**శేరిలింగంపల్లి, మే 28 ప్రభాతవార్త :** మానసిక ఒత్తిడి,తీవ్రమనోవేదనతో బాధపడుతున్న ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని తాను నివాసముంటున్న ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గత కొన్నేళ్లుగా తీవ్ర మనోవేదనతో ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. సంఘటనకు సంబందించి గచ్చిబౌలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్టటం ఘజియాబాద్ జిల్లా శిల్పాసన్ సిటీలో నివాసముండే జయప్రకాశ్ పలివాల్ కుమార్తె నీతూ పలివాల్(42) నగరంలోని విప్రో సంస్థలో ఐటీ ఉద్యోగినిగా పనిచేస్తూ గచ్చిబౌలిలోని టీఎన్జీవో కాలనీలో నివాసముంటున్నారు కాగా గత మూడు సంవత్సరాలుగా తీవ్ర మనోవేదనతో బాధపడుతన్న నీతూ చికికత్సను కూడా తీసుకుంటుంది. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి 9:30గంటల ప్రాంతంలో నీతూ తాను నివాసమంటున్న ఇంట్లోనే సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కాగా నగరంలోనే నివాసం ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తూ, మియాపూర్‌లో నివాసముంటున్న నీతూ సోదరుడు సాయి సురభ పలివాల్ తన సోదరికి ఫోన్ చేయగా ఎంతకూ స్పందించలేదు. దీంతో నీతూ నివాసం ఉంటున్న ఇంటికి వెళ్లగా నీతూ ఇంటి తలుపులు గడియవేసి ఉంది. ఇంటి యజమానులను పిలిచి తలుపులు బద్దలు కొట్టి చూడగా నీతూ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉండటం కనిపించింది. ఈ మేరకు గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు హుటాహుటిన సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కాగా నీతూకు వివాహం జరుగకపోవడం,మానసిక వ్యాధితో బాధపడుతుండటమే ఆమె ఆత్మహత్యకు కారణమని పోలీసులు ప్రాధమికంగా అంచనా వేస్తున్నారు. ఈ మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బాలానగర్‌లో గంజాయి పట్టివేత...మహిళ అరెస్ట్

**హైదరాబాద్, మే28, ప్రభాతవార్త:**



పోలీసుల అదుపులో మహిళా డ్రగ్ స్మగ్లర్ షేక్ జామీన్‌బీ

బాలానగర్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న మహిళను ఎస్‌ఎఫ్‌టీ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఏకంగా ఇంటి నుంచే ఆమె గంజాయిని సరఫరా చేస్తుండడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎస్‌ఎఫ్‌టీ ఎస్.ఐ బీ.బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం, షేక్ జామీన్ బీ అనే మహిళ బాలానగర్ ప్రాంతంలోని ఫతేనగర్‌లో నివాసముంటోంది. ఐతే గత కొంత కాలంగా ఆమె గుట్టు చప్పుడు కాకుండా ఇంటి నుంచే గంజాయి అమ్మకాలు కొనసాగిస్తోంది. ఒక గంజాయి ప్యాకెట్ రూ.300 కు, అంతకంటే ఎక్కువ మోతాదులో ఉన్నది రూ.500కి విక్రయిస్తోంది. మొత్తంగా కిలో గంజాయి రూ.6వేలకు పురానాపూల్ ప్రాంతం నుంచి కొనుగోలు చేసిన ఆమె, వేరు వేరు ప్యాకెట్లుగా గంజాయిని విడదీసి కిలో రూ.10వేలకు తగ్గకుండా విక్రయిస్తోంది. ఈ మేరకు నిందితురాలు పోలీసుల దర్యాప్తులో చెప్పింది. విశ్వసనీయ సమాచారం అందడంతో గంజాయి విక్రయిస్తుండగా ఆమెను అదుపులోకి తీసుకున్న పోలీసులు, కేసు నమోదు చేసి, సీజ్ చేసిన గంజాయితో పాటు నిందితురాలిని న్యాయమూర్తి ముందు హాజరు పరిచి రిమాండుకు తరలించారు.

## తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్ట్

**బేగంపేట మే 28,ప్రభాతవార్త**
తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని పగలు చోరీలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర దొంగను ఎస్సార్ నగర్ పోలీసులు అరెస్ట్ చేసారు.నిందితుడి నుంచి 2లక్షల రూపాయల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈసంఘటనపై ఎస్సార్ నగర్ ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి,డిటెక్టివ్ ఇన్స్‌పెక్టర్ జానకి రాములు వివరాలను తెలియజేసారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తాడిపత్రి సమీపంలోని శ్రీరాములు పేటకు చెందిన వాయులు వారి బాలగోవింద్(22),ఉదయం సమయంలో వీధులలో తిరుగుతూ చెత్త ,చిత్తు కాగితాలు ఏరుకుంటున్నట్లు ఉంటూ తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తిస్తాడు.రాత్రి పూట ఆ ఇళ్లను టార్గెట్ చేసి ఇంటి తాళాలు పగుల గొట్టి చోరీలకు పాల్పడేవాడు.గత సంవత్సరం తాడిపత్రి టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు చోట్ల చోరీలకు పాల్పడి బంగారు,వెండి,ఆభరణాలు,నగదు చోరీ చేసాడు.అక్కడి నుంచి రెండు నెలల క్రితం నగరానికి వచ్చి దాసారం బస్తీలో నివాసం ఉంటున్నాడు.ఈ సంవత్సరం ఎస్సార్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు చోట్ల దొంగతనాలకు పాల్పడ్డాడు.చోరీ చేసిన సొత్తును దాసారం బస్తీ గుడిసెల్లోనే ఉంటున్న పి.సుంకప్ప(36),పి.సురేందర్(25)లకు అప్పగిస్తుంటాడు.వారు చోరీ సొత్తును అమ్మిసొమ్ము చేస్తుంటారు.కొంత చోరీ సొత్తును సనత్‌నగర్ లో పాన్ బ్రోకర్ వ్యాపారం చేస్తున్న అశోక్‌కుమార్ జైన్ వద్ద తాకట్టు పెట్టారు.ఎస్సార్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన చోరీలకు సంబంధించి దర్యాప్తు జరుపుతున్న ఎస్సార్‌నగర్ క్రైం పోలీసు బృందం విశ్వసనీయ సమాచారం మేరకు బాలగోవింద్‌తో పాటు సుంకప్ప,సురేందర్‌లను దాసారం బస్తీలో అరెస్ట్ చేసారు.చోరీ సొత్తు తాకట్టు పెట్టుకున్న అశోక్ కుమార్ జైన్ ను కూడా పోలీసులు అరెస్ట్ చేసారు.నిందితుల నుంచి రూ 2లక్షల విలువ చేసే 30వతులాల వెండి వస్తువులు,2తులాల బంగారు ఆభరణాలు,రూ 2వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

## జాబ్‌మేళాతో నిరుద్యోగ యువతకు ప్రయోజనం

### -గాంధీనగర్ సిఐ డి.రాజు



జాబ్ మేళాలో పాల్గొన్న నిరుద్యోగ యువత

**ముషీరాబాద్, మే 28, ప్రభాతవార్త:** జాబ్‌మేళాలతో నిరుద్యోగ యువతకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని గాంధీనగర్ సీఐ డి.రాజు అన్నారు. మంగళవారం కవాడిగూడలోని విరజానంద వైదిక్ విద్యాలయ ప్రాంగణంలో అరైజ్ ఫౌండేషన్ మరియు విరజానంద విజ్ఞాన కేంద్ర, ఆర్యసమాజ్ ల ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళా కార్యక్రమంకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఒకప్పుడు కేవలం ఇంజనీరింగ్ కళాశాలల్లో నిర్వహించే జాబ్‌మేళాలు ఇప్పుడు సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా నిర్వహించటం అభినందనీయమని కొనియాడారు. ఈ జాబ్ మేళాలో ఎవర్‌గ్రీన్, వెర్టిసాఫ్ట్ సొల్యూషన్స్, రత్నదీప్, ముత్తూట్ ఫైనాన్స్, టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్, మెడ్‌ప్లస్, టీమ్‌లీజ్, టీమ్ హెచ్‌ఆర్, ఐ అండ్ టి ఇన్సూరెన్స్ తదితర సంస్థలు పాల్గొని ఇంటర్వ్యూ ద్వారా 70మందికి పైగా నిరుద్యోగులను వివిధ పోస్టులకు సెలక్ట్ చేసుకున్నారు. సెలక్ట్ అయిన అభ్యర్థులకు కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ చేతుల మీదుగా ఆఫర్ లెటర్‌లు అందచేశారు. ఈ కార్యక్రమంలో విరజానంద వైదిక్ విద్యాలయ అధ్యక్షులు పి.జనార్ధన్, కార్యదర్శి గడీల ఆంజనేయులు, అసిస్టెంట్ సెక్రటరీ పి.వనజకుమార్, ఆర్ఎస్ఎస్ సికింద్రాబాద్ విభాగ కార్యదర్శి భరతపూడి శ్రీనివాస్, అరైజ్ ఫౌండేషన్ డైరెక్టర్ టి.నీలకంఠ మహాదేవ్, సెక్రటరీ సి.ప్రవీణ్, ట్రెజరర్ సీత సంతోష్ పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలి

**-టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జంగయ్య, చావ రవి**

**ముషీరాబాద్, మే 28, ప్రభాతవార్త:** ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు ఏర్పడిన న్యాయపరమైన ఆటంకాలన్నీ తొలగిపోయినందున గత అక్టోబర్‌లో అర్ధాంతరంగా నిలిపివేసిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షులు కే.జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి డిమాండ్ చేశారు. మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేస్తూ పార్లమెంట్ ఎన్నికలు, గ్రాడ్యుయేట్ ఉప ఎన్నిక ముగిసినందున ఎన్నికల కమీషన్ అనుమతితో ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సడలింపు తీసుకుని ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల ప్రక్రియను విద్యాసంస్థల పునఃప్రారంభానికే ముందే ప్రారంభించాలని కోరారు. తొమ్మిది సంవత్సరాలుగా పదోన్నతులు, ఆరు సంవత్సరాలుగా బదిలీలు లేక ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తీరని నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గత అక్టోబర్‌లో బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్స్ అందరినీ రిలీవ్ చేసి, నూతన పాఠశాలలకు పంపాలని, గిరిజన సంక్షేమ పాఠశాలలు, గురుకులాల్లో ఉపాధ్యాయుల బదిఇలీలు, పదోన్నతులు కూడా వేసవి సెలవల్లోనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

### తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రామరాజు



నియామకపత్రాన్ని అందుకుంటున్న కే.రామరాజు

**హైదరాబాద్, మే 28, ప్రభాతవార్త:**

తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కే.రామరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈసీ సమావేశ కార్యక్రమంలో అధ్యక్షురాలు నిర్మల చేతుల మీదుగా ఈ నియామకపత్రం అందుకున్నట్లు రామరాజు తెలిపారు. తనపై నమ్మకంతో తనకు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు అప్పగించిన అసోసియేషన్ నాయకులకు, జలమండలి సిబ్బందికి ఆయన ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి జనరల్ మేనేజర్ సుగంధిని, అసోసియేషన్ నాయకులు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.కే.రాజు, మీడియా సెక్రటరీ రామచంద్రం, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జానకిబాయి, హైదరాబాద్ అధ్యక్షులు మల్లేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రతాప్, ఈసీ సభ్యులు, సైదులు, జలమండలి సిబ్బంది పాల్గొన్నారు.

### మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలి : శ్రీగణేష్,జంపన



బోయిన్‌పల్లి వీరాంజనేయ ఆలయంలో పూజలు చేస్తున్న జంపనప్రతాప్, శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్,మే 28 ప్రభాతవార్త:** మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజిస్తే కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయని కంటోన్మెంట్ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి ఎన్.శ్రీగణేష్, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్‌లు తెలిపారు. మంగళవారం బోయిన్‌పల్లి సాయిబాబా కాలనీలోని శ్రీ వీరాంజనేయ శివపంచాయతన అధిత్య నవగ్రహ దేవాలయంలో నిర్వహించిన 22వ వార్షికోత్సవ వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. అనంతరం ప్రముఖ వ్యాపార వేత్తలు పృథ్వీనాథ్ సునీల్,రేణుకల ఆధ్వర్యంలో వందలాది మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బానుక మల్లికార్జున్, నంద కిషోర్, మాలాద్రి, అరుణ్ యాదవ్, బాల్‌రాజ్ యాదవ్, ఆలయ అధ్యక్షులు పిప్పరమెట్ల శంకరయ్య, ప్రతినిధులు శేఖర్,కృష్ణ, నాగభూషణం, గోవర్ధన్, ఆలయ అర్చకులు హేమంత్ స్వామి తదితరుల పాల్గొన్నారు.

### కంటోన్మెంట్ బోర్డు అభివృద్ధికి వందకోట్లు నిధులు మంజూరు : మధుకర్ నాయక్

**కంటోన్మెంట్,మే 28 ప్రభాతవార్త:** అమృత్ పథకం ద్వారా కంటోన్మెంట్ బోర్డు అభివృద్ధికి వంద కోట్ల రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని బోర్డు నామినేటెడ్ మెంబర్ జె.రామక్రిష్ణ, నసిఈఓ మధుకర్ నాయక్‌లు తెలిపారు. మంగళవారం 2వ వార్డులోని ఇందిరమ్మ నగర్, బీరప్ప ఆలయం, నాగమ్మ దేవాలయం, సిబిఎన్.నగర్ పరిసర ప్రాంతాల్లో వివిధ విభాగాల ఇంజనీర్లతో కలిసి పర్యటించారు. బస్తీలు, కాలనీల్లో దీర్ఘకాలంగా నెలకొన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైనేజీ సమస్యను వీలైనంత త్వరలో పరిష్కరిస్తామన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సహకారంతో అమృత్ పథకం ద్వారా కంటోన్మెంట్ బోర్డుకు వందకోట్ల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపరిండెంట్ ఎం.దేవేందర్, ఇంజనీర్లు ఉమా శంకర్,ఫనికుమార్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

### మొక్కు తీర్చుకున్న బిఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు, నాయకులు

**పేట్ బషీరాబాద్, మే 28, ప్రభాతవార్త :** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, అపర భగీరథుడు కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఆశీర్వాదంతో కెపి వివేకానంద 3వ సారి సార్వత్రిక ఎన్నికల్లో గెలవాలని గత సంవత్సరం జూలై మాసంలో మలేషియాలోని శ్రీశ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ జిహెచ్ఎంసి డివిజన్ అధ్యక్షులు, నాయకులు పూజలు నిర్వహించగా నవంబర్ మాసంలో జరిగినటువంటి తెలంగాణ రాష్ట్రం అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోనే అత్యధికంగా 85570 ఓట్ల మెజార్టీతో గెలుపొందిన కేపీ వివేకానంద గెలుపు నిమిత్తం మంగళవారం మలేషియాలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు దూదిమెట్ల సోమేశ్ యాదవ్, జిహెచ్ఎంసి డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, రుద్ర అశోక్, పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకుడు ఎత్తరి మారయ్య, వేణుయాదవ్, జనార్ధన్ పాల్గొన్నారు.

## ఘనంగా నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు..



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు



ఎన్టీఆర్‌కు నివాళ్లు అర్పిస్తున్న రామకృష్ణ, టిడి జనార్ధన్, రఘురామకృష్ణంరాజు తదితరులు

**ముషీరాబాద్, మే 28, ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీ రామారావు జయంతి వేడుకలు ముషీరాబాద్ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం సికింద్రాబాద్ పార్లమెంట్ కమిటీ ఆధ్వర్యంలో లోయర్‌ట్యాంక్ బండ్‌లోని పార్టీ కార్యాలయంలో భారీ కేక్ కట్ చేశారు. అనంతరం అశోక్‌నగర్ చౌరస్తాలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా మాట్లాడుతూ ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి మండలంలో ఎన్టీఆర్ విగ్రహాలు ఏర్పాటు చేసే విధంగా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమాలలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, శ్యాంసుందర్, పరశురాం, ప్రమీల, కట్టరాములు, వెంకటేష్‌చౌదరి, భవాని శ్రీనివాస్, ఎస్.ప్రకాష్, కిరణ్, సత్యనారాయణ, యాదగిరి, రాజు, భానుప్రకాష్, శక్తి ప్రేమ్, జాకబ్, వి.రామారావు, మల్లికార్జున్, షేక్‌బాబు, వై.ఎల్.నర్సింహాగౌడ్ పాల్గొన్నారు.

**ఫిల్మ్‌నగర్ కల్చరర్ సెంటర్‌లో**

**హైదరాబాద్, మే 28,ప్రభాతవార్త:** కేంద్రంలో ఏర్పడే నూతన ప్రభుత్వం స్వర్గీయ నందమూరి తారకరామారావుకు భారత రత్న పురస్కారం అందించాలని మాజీ ఎమ్మెల్సీ ,ఎన్టీఆర్ లిటరేచర్,సావనీర్ అండ్ వెబ్‌సైట్ కమిటీ చైర్మన్ టిడి జనార్ధన్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఎన్టీఆర్ 101 జయంతిని పురస్కరించుకుని ఫిల్మ్‌నగర్ కల్చరర్ సెంటర్ ( ఎఫ్ఎన్‌సిసి)లో ఎన్టీఆర్ లిటరేచర్, సావనీర్ అండ్ వెబ్‌సైట్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలను నిర్వహించారు.దీనికి ముఖ్యఅతిథులుగా ఎన్టీఆర్ కుమారుడు నందమూరి రామకృష్ణ, తెలుగు దేశం నాయకులు కనుమూరి రామకృష్ణంరాజు, మాజీ ఎంపి యలమంచిలి శివాజీ , ప్రముఖ నిర్మాత ,కె.ఎస్ రామారావు ,ప్రముఖ నిర్మాత ఘట్టమనేని ఆదిశేషగిరిరావు ,పుండరీ కాంక్షయ్య తనయులు అట్లూరి నాగేశ్వర్‌రావులు పాల్గొని ఎన్టీఆర్‌తో తమకున్న అనుబంధాన్ని, సాన్నిహిత్యాన్ని ఆయనలోని విలక్షణాలను గుర్తుచేశారు.

**ఎన్టీఆర్ సన్నిహితులకు సన్మానం ..**

ఈసందర్భంగా ఎన్టీర్ జీవించి ఉండగా ఆయనకు వ్యక్తిగతంగా సేవలు అందించిన వైద్యులు డా.సోమరాజు, డా.బిఎన్‌ప్రసాద్ ,డా.డిఎన్‌కుమార్‌లతోపాటు పిఏగా పనిచేసిన శివరామ్ ,వంటమనిషి బీరయ్య, సహాయ మేకప్‌మెన్ అంజయ్య, డ్రైవర్ రమేష్ , ఆఫీస్ అటెండెంట్ చంద్రశేఖర్ యాదవ్, ఎన్టీఆర్ అభిమానులు మన్నే సోమేశ్వర్‌రావు, బొప్పన ప్రవీణ్, ఎన్టీఆర్ నఫీజ్, కొడాలి ప్రసాద్ ,ఈదర చంద్ర వాసులకు కమిటీ చైర్మన్ టిడి జనార్ధన్ సారథ్యంలో ఘనంగా సన్మానించారు.

**కంటోన్మెంట్‌లో..**

**కంటోన్మెంట్,మే 28 ప్రభాతవార్త:** ఉమ్మడి రాష్ట్రాల మాజీ ముఖ్య మంత్రి నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్)తోనే తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ చైతన్యం రావడంతో పాటు అభివృద్ధి జరిగిందని మల్కాజిగిరి పార్లమెంట్ టీడిపి ప్రధాన కార్యదర్శి బి.గౌరి శంకర్ యాదవ్ తెలిపారు. ఎన్టీఆర్ 101 జయంతిని పురస్కరించుకొని మంగళవారం రెజిమెంటల్ బజార్‌లో ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన టీడిపి సీనియర్ నాయకులు టీ.ఎన్.నరహరి, నామ్‌దేవ్, శ్రీనివాస్, నర్సింగరావ్, దత్తాత్రేయ, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

**అడ్డగుట్టలో**

**అడ్డగుట్ట,మే 28 ప్రభాతవార్త:** తెలుగు దేశం పార్టీ వ్యవస్తాక అధ్యక్షులు, మాజీ ముఖ్య మంత్రి ఎన్టీరామారావు జయంతిని పురస్కరించుకొని మంగళవారం అడ్డగుట్ట సి-సెక షన్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్దఏర్పాటు చేసిన వేడుకలకు టీడిపి సికింద్రాబాద్ ఇన్‌ఛార్జి వల్లారపు శ్రీనివాస్ పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదలకు, పండ్లుబ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడిపి సీనియర్ నాయకులు చందర్, పి.నరి సింహ్మా,నాగేశ్ ముదిరా జ్, రమేశ్, కుమార్, బద్రి, విజయ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

**జెఎన్‌టియు సర్కిల్‌లో**

**కెపిహెచ్‌బి కాలనీ, మే 28, ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 101వ జయంతిని పురస్కరించుకుని, కెపిహెచ్‌బి కాలనీ డివిజన్ తెదేపా సీనియర్ నాయకులు అట్లూరి దీపక్ ఆధ్వర్యంలో మంగళవారం జెఎన్‌టియు సర్కిల్‌లోని ఎన్‌టిఆర్ విగ్రహానికి స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. తదుపరి రైతు బజార్‌లో ఉండే వారికి మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం కెపిహెచ్‌బి డివిజన్ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కెపిహెచ్‌బి ఫేజ్3, రమ్య గ్రౌండ్ తెదేపా దిమ్మె వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించి, కేక్ కటింగ్ చేశారు. అనంతరం స్వీట్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు షేక్ సత్తార్, శివ సత్యనారాయణ, వాసిరెడ్డి లక్ష్మీ నారాయణ, కొల్లూరి శ్రీనివాస్, కాకర్ల గోపికృష్ణ, జాస్తి రమాదేవి, చంద్రరావు, చిరు మామిళ్ల ఉమ, నారాయణరావు, రాజా, కేవీఆర్ చౌదరి, కిషోర్, ఆనందరావు, సాంబశివరావు, రవి, శ్రీను, దొరబాబు, కంచర్ల శ్రీను, మదన్మోహన్, పవన్, ప్రవీణ్, ఆర్‌కే మోరంపూడి, శివ, నాని, హేమంత్, నవీన్, శివచౌదరి, సునీత, పవన్ తదితరులు పాల్గొన్నారు.

**హరిబౌలి చౌరస్తాలో..**

**చార్మినార్,మే 29 ప్రభాతవార్త :** హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం చార్మినార్ సమీపంలోని హరిబౌలి చౌరస్తా వద్ద మంగళవారం పాతబస్తీ టిడిపి నాయకులు తెలుగు దేశంపార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 101 జన్మ దిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ చిత్ర పటానికి పాతబస్తీ టిడిపి నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శులు డాక్టర్.ఆవుల భరత్ ప్రకాష్,పెద్దోజు రవీంద్ర చారి,మాజీ కార్పొరేటర్ జి.శంకర్ ముదిరాజ్,టిడిపి నాయకులు చల్లా రాజ్ కుమార్, చంద్రకుమార్,జోగేందర్ సింగ్,బి.వై.శ్రీ కాంత్,సత్యకృష్ణ,ఈర్.సద్గుణ రాణి,అజయ్ కుమార్,మహ్మద్ చాంద్ పాషా,బి.రాములు.అశోక్ మేదర,దేవేందర్ గుప్తా, సూర్యప్రకాష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఎంఎంటిఎస్ రైల్వే స్టేషన్ ఏర్పాటుకు చర్యలు

### -ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



రైల్వే డిఆర్‌ఎంకు వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

**అల్వాల్, మే 28 ప్రభాతవార్త:** అల్వాల్ లయోలా కళాశాల వద్ద ఎంఎంటిఎస్ రైల్వే స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని రైల్వే డిఆర్‌ఎంకు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డితో పాటుగా కార్పొరేటర్లు వినతి పత్రం అందించారు. మంగళవారం ప్రజా ప్రతినిధులు సికింద్రాబాద్‌లో డిఆర్‌ఎం భర్తేష్ కుమార్‌ను కలిసారు. కళాశాల వద్ద రైల్వే స్టేషన్ ఏర్పాటు ద్వారా ఎంఎంటిఎస్ రైళ్ళు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే వివరించారు. స్థానిక ప్రజలుతో పాటుగా జంట నగరాలులోని వివిధ ప్రాంతాలు నుంచి లయోలా కళాశాలకు వందలాదిగా నిత్యం విద్యార్థులు రాక పోకలు సాగిస్తున్నారని తెలిపారు. చర్లపలి నుంచి లింగంపల్లి వెళ్ళే మార్గంలో అల్వాల్‌కు చెందిన అనేక ప్రాంతాలు అనుసందానంగా ఉన్నాయని పేర్కొన్నారు. రైల్వే స్టేషన్ ఏర్పాటు కోసం సంవత్సరాలుగా కాలంగా ప్రజలు కోరుతున్నారని వివరించారు. స్టేషన్ సాధన కమిటీ ఏర్పాటైన నేపధ్యంలో ప్రాధాన్యతను గుర్తించాలని డిఆర్‌ఎం భర్తేష్ కుమార్‌ను ఎమ్మెల్యే కోరారు. రైల్వే స్టేషన్ ఏర్పాటుకు సంబంధించి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని ఎమ్మెల్యేకు డిఆర్‌ఎం హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కౌన్సిల్ సభ్యురాలు కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి బిఆర్ఎస్ నేతలు అనీల్ కిషోర్, పరమేష్ రిలైర్డ్ రైల్వే అధికారి నూర్ అహ్మద్, సంపత్ రెడ్డి, మురళి క్రిష్ణ, బెన్ని, అర్జున్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర మేరు సంఘం ఎన్నికలు

**చార్మినార్,మే 29 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర మేరు సంఘం ఎన్నికలు జూన్ నెల 30వ తేదీన జరగనున్నాయని రాష్ట్ర మేరు సంఘం ఎన్నికల అధికారులు పోలంపల్లి సురేష్ కుమార్,అసిస్టెంట్ ఎన్నికల అధికారి దాచ జగదీష్ చందర్, ఎన్నికల పరిశీలకులు పొన్నాకుల శ్రీనివాస్‌లు తెలిపారు. దారుషిఫా మేరు సంఘం భవనంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు రాష్ట్ర మేరు సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు.మే నెల 13 నుంచి 16వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ,వచ్చే నెల 30వ తేదీన రాష్ట్ర మేరు సంఘం ఎన్నికలు జరగనున్నాయని వారు తెలియజేశారు.కాగా సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మేరు సంంఘం ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

### కన్నుల పండువగా సాగిన శృంగార రథోత్సవం

**చిక్కడపల్లి, మే 28 ప్రభాతవార్త:** చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి స్వామివారు శృంగార రథోత్సవంపై అధిరోహించారు. పాంచరాత్రాగ శాస్త్రోక్తంగా ఉత్సవాలను ఆలయం వ్యవస్థాపక వంశీయులు స్వర్గీయ గుడిదేవుని రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు, ఆలయం వంశీకులు గుడిదేవుని శ్రీనాథ్‌గౌడ్, ఈవో కె.రామాంజనేయుల ఆధ్వర్యంలో విష్వక్సేన పూజ, రక్షాబంధనము, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ట, మహానివేదన, మంత్ర పుష్పం వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పతాధివాసము, హవనము, భేరిపూజ, దేవతాహ్వానము, హవనము, బలిహరణము కార్యక్రమాలను నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో లలిత సహస్ర, విష్ణుసహస్రనామ పారాయణాలను నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయం వెలపల సాంస్కృతిక కార్యక్రమాలు,లలిత సహస్ర, విష్ణుసహస్రనామ పారాయణాలు నిర్వహించారు. కాగా బుధవారం పూర్ణాహుతి, చక్రతీర్థము, ద్వాదశారాధన, శ్రీ పుష్పయాగం, దేవతోద్వాసన ఉంటుంది. గురువారం ఘటాభిషేక కార్యక్రమాన్ని 81 కలశాలతో జరుగుతుంది. ఈ సందర్భంగా స్వామివారి వెండిపూత ఘటాభిషేక అష్టలక్ష్మి కలశాలను ఇవ్వడం జరుగుతుంది. అదే రోజు రాత్రి స్వామివారి శృంగార డోలోత్సవం అనంతరం వేదపండితులకు సన్మాన కార్యక్రమం ఉంటుంది.

### దాశరథి ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో లఘుచిత్రాల పోటీ

**చిక్కడపల్లి,మే 28 ప్రభాతవార్త:** బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రం ఆవరణలో దాశరథి ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో లఘుచిత్రాల పోటీల కోసం ఎంట్రీలకు ఆహ్వానిస్తున్నట్లు సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వినయకుమార్, బిడిఎల్ సత్యనారాయణ తెలిపారు. ఇతర వివరాలకు 9848199863 ద్వారా ఇతర వివరాలు పొందవచ్చన్నారు. ఇందులో భాగంగా జూన్ 22న దాశరథి కృష్ణమాచార్యుల జయంతి సందర్భంగా లఘుచిత్రాల పోటీ నిర్వహించాలని నిర్ణయించామని, 'ప్రజాస్వామ్యమా? ఓటరా నీ దారటు? అంశంపై 15నిమిషాల లోపు, చిత్రం తెలుగులో ఉండాలని అన్నారు. ఈ పోటీ కోసం జూన్ 10లోగా లఘుచిత్రాలను తమకు పంపాలని, మొదటి, రెండవ, మూడవ బహుమతి కింద రూ.20 వేలు, రూ.15వేలు, రూ.10వేలు ఇవ్వడం జరుగుతుందని, ఎంట్రీఫీజు లేదని తెలిపారు.

## అమృత్ పథకం ద్వారా కంటోన్మెంట్‌ను అభివృద్ధి చేస్తాం

### -కంటోన్మెంట్ బోర్డు సభ్యులు రామకృష్ణ

**బేగంపేట మే 28,ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వ పథకం అమృత్ ద్వారా 100కోట్ల రూపాయలతో కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని కంటోన్మెంట్ బోర్డు సభ్యులు జె.రామకృష్ణ అన్నారు.మంగళవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ వార్డు 2 పరిధిలోని ఇందిరమ్మ నగర్ బీరప్ప ఆలయం,నాగమ్మ ఆలయం,పెద్దరోడ్,సీబీఎన్ నగర్‌లలో కంటోన్మెంట్ బోర్డు అధికారులతో కల్సి రామకృష్ణ పర్యటించారు.ఆయా కాలనీల్లో దీర్ఘ కాలంగా ఉన్న సమస్య అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఆయన పరిశీలించారు,అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్య పరిష్కారం లో భాగంగా త్వరలోనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపడతామన్నారు.అలాగే ప్రధాని నరేంద్రమోదీ సహకారంతో కేంద్ర ప్రభుత్వ పథకమైన అమృత్ పథకం ద్వారా సుమారు వంద కోట్ల నిధులతో వార్డు 2 తో పాటు కంటోన్మెంట్ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని,అందుకు తగిన ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్,బోర్డు సిబ్బంది,బిజేపీ నాయకులు పాల్గొన్నారు.

## జీరో హంగర్ కార్యక్రమానికి మలబార్ శ్రీకారం

### -70నగరాల్లో 51వేలమందికి ఆహారం అందజేత




లోగో ఆవిష్కరిస్తున్న డిజీ భూపాల్, ప్రవీణ్ , సిరాజ్ తదితరులు

**హైదరాబాద్, మే 28,ప్రభాతవార్త:**

ప్రముఖ గోల్డ్ అండ్ డైమండ్స్ మలబార్ గ్రూప్ జీరో హంగర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో ఈకార్యక్రమం ద్వారా పేదలకు ఆహారాన్ని అందిస్తుండగా తాజాగా ఈసేవలను మరింత విస్తరించే కార్యక్రమం చేపట్టింది. వరల్డ్ హంగర్‌డే సందర్భంగా మంగళవారం సోమాజిగూడలోని మలబార్‌షోరూంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సేవలకు సంబంధించిన లోగోను పోలీస్ హెడ్‌క్వార్టర్స్ డిజీ డాక్టర్ గజారావు భూపాల్, ఏరో స్పేస్ అండ్ డిఫెన్స్ విభాగం డైరెక్టర్ ప్రవీణ్, మలబార్ గోల్డ్ రిటైల్ హెడ్ అపరేషన్స్ సిరాజ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా సిరాజ్ మాట్లాడుతూ మలబార్ గ్రూప్ ఆధ్వర్యంలో ఇప్పటికే 16 రాష్ట్రాల్లోని 37 నగరాల్లో 31వేలమంది పేదలకు ఆహారాన్ని అందిస్తున్నామని, తాజాగా 70నగరాల్లో 51వేల మందికి అందించేందుకు కృషి చేస్తున్నామని అకలి రహిత ప్రపంచ సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.

### హైకోర్టులో మాదిగలను అడిషనల్ అడ్వకేట్ జనరల్‌గా నియమించాలి

**సైఫాబాద్, మే 28 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాక ముందు మాదిగలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాదిగ రాజ్యాధికార పోరాట సమితి తిమన్న నవీన్‌రాజ్ డిమాండ్ చేశారు. ముఖ్యంగా హైకోర్టులో అడిషినల్ అడ్వకేట్ జనరల్‌గా మాదిగ సామాజిక వర్గానికి చెందిన న్యాయవాదిని నియమించాలని కోరారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ విషయంపై ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు విజ్ఞప్తి చేయడం జరిగిందని, మంత్రి సానుకూలంగా స్పందించారని, త్వరలో ముఖ్యమంత్రి రేవంత రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని సమర్పిస్తామన్నారు. ఈ సమావేశంలో సమితి నాయకులు జయరామ్‌రాజు, ఎల్లేష్, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చట్ట విరుద్ధంగా వెలుస్తున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

**నార్సింగి, మే 28 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు ఉల్లంఘించి నిర్మిస్తున్న భవనాలపై చట్ట పరిధిలో చర్యలు తీసుకోవాలని, కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పంచవటి కాలనీ ప్రజలు కమీషనర్ ప్రదీప్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ ప్రతినిధులు శ్రీపతిరెడ్డి, మూర్తి, రామసుబ్బారెడ్డి, రవీందర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, రాఘవరెడ్డిలు మాట్లాడుతూ మా కాలనీలో సమస్యలు తీవ్ర రూపం దాల్చాయని, వాటిని పరిష్కరించాలని కమీషనర్‌తో మొరపెట్టుకున్నారు. బూల్కాపూర్ నాలా పూడిక పనులు త్వరగా ప్రారంభించాలని, గుంతలమయమైన రోడ్లతో నిత్యం నరకయాతన పడుతున్నామని, బిల్డర్లు అనుమతి ఒకటి తీసుకొని అంతకంటే అదనంగా నిర్మాణాలు చేపడుతున్నారని, పెంట్‌హౌస్‌లు నిర్మిస్తున్నారని ఇలాంటి వారిపై కఠినంగా వ్యవహరించాలని కోరారు. త్వరలోనే కూల్చి వేతలు చేయడం జరుగుతుందని కమీషనర్ హామీనిచ్చారు. కమీషనర్ స్పందన పట్ల పంచవటి కాలనీ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

### మీర్‌పేట్ పెద్ద చెరువులో మహిళ మృతదేహం

**సరూర్‌నగర్, మే 28 ప్రభాతవార్త:** మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మీర్‌పేట్ పెద్ద చెరువులో ఆత్మహత్య చేసుకున్నట్లుగా భావిస్తున్న గుర్తు తెలియని ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. మంగళవారం మధ్యాహ్నం చెరువులో చేపలు పడుతున్న వారికి నీటిలో మహిళ మృతదేహం కనిపించడంతో వారు సమీపంలోని మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో సంఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు శవాన్ని చెరువు నీటి నుండి బయటకు తీయించారు. అయితే చెరువు ఒడ్డున కళ్ళ జోడు, నడుము బెల్టు గమనించిన పోలీసులు అవి ఆమెవేనని ప్రాథమికంగా నిర్ధారించారు. కాగా మహిళ ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మహిళను గుర్తించిన వారు మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం (నెంబర్ 8712662646)కు సమాచారం ఇవ్వాలని ఇన్స్‌పెక్టర్ కాశీవిశ్వనాథ్ కోరారు.

## మినిస్టర్స్ క్వార్టర్స్‌లో సామగ్రి చోరీ

### -అధికారి ఫిర్యాదుతో అప్రమత్తమైన పోలీసులు

**హైదరాబాద్, మే28, ప్రభాతవార్త:**

మినిస్టర్స్ క్వార్టర్స్‌లో నిర్మాణ సామగ్రి దొంగిలించిన వైనం బంజారాహిల్స్ ప్రాంతంలో చోటు చేసుకుంది. నిర్మాణంలో ఉన్న కన్‌స్ట్రక్షన్ సైట్ నుంచి కొత్త తలుపులతో పాటూ స్టీల్ సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్ళిపోయారు. అత్యంత పరిష్టమైన భద్రత ఉన్న మంత్రుల నివాస ప్రాంగణంలోనే దొంగతనం జరగడంతో ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. ఇది క్రింద స్థాయి అధికారుల పనే అయ్యి ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో ఆర్ ఎండ్ బీ అధికారి ఫిర్యాదుతో అప్రమత్తమయిన పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## ప్రజాసంక్షేమం ఆర్థిక క్రమశిక్షణకు ఎన్టీఆర్ పెద్దపీట

### -లోకసత్తా వ్యవస్థాపకుడు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. ఎన్.జయప్రకాశ్ నారాయణ



ఎన్.టి.ఆర్ శతజయంతి సంచికను ఆవిష్కరిస్తున్న జయప్రకాశ్ నారాయణ, రామచంద్రమూర్తి, రామమూర్తి తదితర తదితరులు

**నాంపల్లి, మే 28 ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ అధికారం లక్ష్యం కాకుండా ప్రజాహితమే పరమావధిగా రాజకీయాల్లోకి ప్రజాసేవకై వచ్చిన వ్యక్తి అని, ఆయన ప్రజాసంక్షేమమే ముఖ్యంగా కనిపించినా ఆర్థిక క్రమశిక్షణ అత్యంత ముఖ్యంగా ప్రజాధనం ప్రతీ ఒక్క రూపాయి కూడా జాగ్రత్త ఏమాత్రం వృధాకి ఆమోదించేవారు కాదని లోకసత్తా వ్యవస్థాపకుడు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. ఎన్.జయప్రకాశ్ నారాయణ అన్నారు. అభివృద్ధిలేని సంక్షేమాన్ని ఎప్పుడూ కోరుకోలేదని స్పష్టం చేశారు. పెత్తందార్ల వద్దనున్న రాజకీయాన్ని ప్రజల వద్దకు తీసుకొచ్చిన మహానాయకుడని, రాజకీయమంటే అసహ్యంగా డబ్బులతో ఓట్లను కొనడంతప్ప మరోమార్గం లేదన్న నేటి తెలుగునాట ఎన్టీఆర్ ఒక్కరూపాయి పెట్టనీయకుండా ఖర్చుపెట్టకుండా నీతివంతమైన ప్రజల మద్దతు రాజకీయం తప్ప కొనే మోసగించే రాజకీయం కాకుండా ఎమ్మెల్యేలు, ఎంపిలను గెలిపించారని గుర్తుచేశారు. అధికారం కోసం దేశాన్నే తాకట్టుపెట్టి దేశభవిష్యత్తును నాశనంచేసే రాజకీయం కొనసాగడమా... చట్టబద్ధ పాలనలో చట్టమందరికీ సమానంగా బరితున్నవాడిదే బర్రె అయ్యి అధికారమున్నవాడికి చుట్టం కాకుండా ప్రజాస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లారని కొనియాడారు. ఎన్టీఆర్ సినీజగత్తులో తిరుగులేని మహానటుడుగా ఆ సామ్రాజ్యాన్ని జయించి రాజకీయాల్లోకి వచ్చిన వెంటనే సాటిలేని మేటిగా చెలామణి అవ్వుతూ దిగ్విజయంగా సాగారన్నారు. చెప్పినమాట వినడం, జవదాటకపోవడం నైజమన్నారు. ప్రజాసంక్షేమానికి తొలిబాట వేశారని, రాష్ట్రాభ్యుదమే ధ్యేయంగా సమగ్రాభివృద్ధికి చిత్తశుద్ధితో పాటుపడ్డారని అధ్యక్షోపన్యాసంలో కె.రామచంద్ర మూర్తి కొనియాడారు. చెన్నపురి తెలుగు అకాడమీ ఆధ్వర్యంలో పద్మశ్రీ నందమూరి తారక రామారావు 101వ జయంతి సందర్భంగా నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో సీనియర్ సంపాదకుడు డా. కె.రామచంద్రమూర్తి సభాధ్యక్షతన రింగు రామమూర్తి నిర్వహణలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎన్.జయప్రకాశ్ నారాయణ విశిష్ట అతిథులు డా. బీరం సుందరరావు, డా. ఎం.సంజీవరావు, తిరునగరి భాస్కర్ తదితరులతో కలిసి ఎన్.టి.ఆర్ ఎట్‌దరేట్100 శతజయంతి పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం టాంక్ బండ్ విగ్రహాల ప్రశస్తి పుస్తకంపై వక్తల సమీక్ష జరిగింది.


**IN THE COURT OF THE HON'BLE IV ADDL. DISTRICT & SESSIONS JUDGE, R.R. DISTRICT AT L.B. NAGAR**
**O.S.NO. 156/2022**

Between:
Bhagavathi Bai and others. .. Plaintiffs.
And
Kantekar Ramana Bai & Others ..Defendants.

To
1. Kantekar Shivani (@ Jamalpur Shivvi Bai) W/o Jamalpur. Ram D/o Late Kantekar Laxmanji, aged: 43 years,Occ.: Housewife, R/o Ibrahimpatnam, Ranga Reddy.
2. N.Shankaraiah S/o Late Lachmaiah, aged: 77 years,Occ.: Agricultural,
3 .N.Yadaiah S/o Late Lachmaiah, aged: 72 years,Occ.: Agricultural,
4.N.Kandaiah S/o Late Lachmaiah, aged: 72 years,Occ.: Agricultural,
Sl.Nos.2 to 4 all R/o at Kothapet, Balapur, Rangareddy District
5. Mohd. Abdul Waheed S/o Mohd. Abdul Hammed, Aged about 63 years, Occ: Business, R/o. 13-107, Chisthi Chamen, Hyderabad.
6. Mohd . Abdul Fareed S/o Mohd. Abdul Hammed, Aged about 58 years, Occ: Business, R/o. 13-108, Chisthi Chamen, Hyderabad.
7. Mohd .Afzal S/o Mohd. Khaja, Aged about 63 years, Occ: Business, R/o. 42-26/15/61,Mahathama Gandhi nagar, Hyderabad.
8. Hari Agarwal S/o Gokul Das, Aged about 60 years Occ: C.A, R/o H.No.21-2-446, Mitti-ka-share, Charkhaman Hyderabad.
9. P. Vasu Dev Reddy S/o P. Joga Reddy, Aged about 65 years Occ: Business R/o H.No.2-19-90, Kalyanpuri colony, Uppal Rangareddy District.
10. N. Srikanth Reddy S/o N. Ananth Reddy, Aged about 58 years, Occ: Business, R/o 18-5-554, Outside, Aliabad, Hyderabad.
11. B. Bharathi W/o B. Yadi Reddy, Aged about 50 years, Occ: housewife, R/o Balapur village, Saroornagar mandal, Rangareddy District.
12. B. Yadi Reddy S/o Tirupathi Reddy, Aged about 58 years, Occ: Business, R/o Balapur village, Saroornagar mandal, Rangareddy District.
13. Mahati Infra Rep. its manger Undavalli Uma Maheshwari C/o Almasguda, mankhal, Maheshwaram mandal, Rangareddy district

Take notice that the plaintiffs filed the above Suit for partition and separate possession and the same is posted on 5-6-2024, for your appearance before the above court at 10.30 a.m. either in person or through an authorized Advocate and answer the claim of the plaintiffs, failing which the matter will be decided as per material available on record.

//BY ORDER//
V. MAHIPAL REDDY, Advocate
Office at, D/No 16-2-740/75/80, Plot. No 80, Main road, V.K.Dhage Nagar, Malakpet, Hyderabad-36. M.No.93911 03151



**IN THE COURT OF THE HON'BLE I JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT: SECUNDERABAD.**
**O.S. No. 291 of 2024**

Between:
**1. Mrs. Karuna Jhunjhunwala,** W/o. Late Anil Kumar Jhunjhunwala, Age about 64 Years, Occ: Household,
**2. Mrs. Komal Kedia,** D/o Late Anil Kumar Jhunjhunwala, Age about 44 Years, Occ: Household,
**3. Mr. Abhishek Jhunjhunwala,** S/o Late Anil Kumar Jhunjhunwala, Age about 42 years, Occ: Business,
**4. Mr. Anuraag Jhunjhunwala,** S/o Late Anil Kumar Jhunjhunwala, Age about 39 Years, Occ: Business,
All are R/o H.No. 1-8-138/A, Situated at P.G. Road, Bapu Bagh Colony, Secunderabad. **...Plaintiffs**
AND
**1. The Tahsildar** Secunderabad Mandal, Secunderabad.
**2. All Other concerned** **...Defendants**

TO,
**ALL CONCERNED**
The plaintiffs have filed suit for declaration to declare the plaintiffs are the legal heirs of the deceased Late Anil Kumar Jhunjhunwala, hence you have to appear before the court on **14-06-2024 at 10:30** am for your appearance,otherwise matter will be decided as per law.

(By order of the Hon'ble Court)
**Sd/- GAURAV KWATRA & Associates Advocates**
Counsel for Plaintiffs
**Office:** M1 & M2, H.No.3-6-728, Himayathnagar, Hyderabad.
**Ph: 9885058221.**



**IN THE COURT OF THE HON'BLE IV ADDL. DISTRICT & SESSIONS JUDGE, R.R. DISTRICT AT L.B. NAGAR**
**I.A.No.182 of 2022 in O.S.N0. 156/2022**

Between:
BhagavathiBai and others. ..Petitioners/Plaintiffs.
And
Kantekar Ramana Bai & Others ..Respondents/Defendants.

To
1. Hari Agarwal S/o Gokul Das, Aged about: 60 years Occ: C.A, R/o H.No. 21-2-446, Mitti-ka-share, Char khaman Hyderabad.
2. Mahati Infra Rep. its manger Undavalli Uma Maheshwari C/o Almasguda, mankhal, Maheshwaram mandal, Rangareddy district .

Take notice that the plaintiffs filed the above I.A. and suit for partition and separate possession and not alienate the suit property and the same is posted on 5-6-2024, for your appearance before the above court at 10.30 a.m. either in person or through an authorized Advocate and answer the claim of the petitioners, failing which the matter will be decided as per material available on record.

//BY ORDER//
V. MAHIPAL REDDY
Advocate
Office at, D/No 16-2-740/75/80, Plot. No 80, Main road, V.K.Dhage Nagar, Malakpet, Hyderabad-36. M.No.93911 03151



తెలంగాణ ప్రభుత్వం
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ-డివిజన్-14, GHMC**

నిట్ నెం.05/E.E.14/GHMC/2024-25, తేది: 28.05.2024, పని పేరు: GHMC, KZ, గోషామహల్, డివిజన్-14 క్రింద వివిధ సివిల్ ఇంజనీరింగ్ పనులు. అంచనా మొత్తం/ECV (రూ.లక్షలలో): 27.50, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు, సమయం: 29.05.2024న ఉ.11.00 గం. 01.06.2024న ఉ.11.00 గం. అధికారి పేరు, చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-14, GHMC, 5వ అంతస్తు, అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్, అబిడ్స్, హైదరాబాద్-9989930428. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-14, GHMC
DIPR.No.74-PP/CL/Advt/1/2024-25, తేది: 28.05.2024


బస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

## గ్రామానికి బస్సు సౌకర్యం పట్ల హర్షం

**కేశంపేట, మే 28, ప్రభాతవార్త** గ్రామానికి నూతన బస్సు సౌకర్యం కల్పించడం పట్ల గ్రామస్తులు ఆనందోత్స వాలలఓ మునిగితేలారు. మంగళవారం కేశంపేట మండల పరిధిలోని నిడదవెల్లి గ్రామం నుంచి ఇసదన్ వెళ్లేందుకు కొత్త బస్సును గ్రామస్తులు ప్రారంభించారు. ఈ బస్సు సౌకర్యం పట్ల రావిచెడు మక్తమాదారం కద్దల గ్రామాలకు వెళ్లడానికి సౌకర్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు హ వ్వారి ఉమాపతి సిల్వర్ మల్లయ్య బడకశ్రీను జీవనమూర్తి అశోక్ సాయి మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## యూనిఫామ్ కటింగ్ సెంటర్‌ని పరిశీలించిన ఎంపిపి


యూనిఫామ్ కటింగ్‌లను పరిశీలిస్తున్న ఎంపిపి సుకన్య భాష

**యాచారం మే28,ప్రభాతవార్త :** యాచారం మండల కేంద్రంలోని ఐకెపి భవనంలో నిర్వహించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల యూనిఫామ్ కటింగ్ సెంటర్‌ను మంగళవారం స్థానిక ఎంపిడివో నరేందర్ రెడ్డితో కలిసి ఎంపిపి కొప్పు సుకన్య భాష పరిశీలించారు. విద్యార్థుల యూని ఫామ్ కటింగ్‌ను వేగవంతం చేసి వీలైనంత తొందరలో యూనిఫామ్ సిద్ధం చేయాలని ఆమె సూచించారు. యూనిఫామ్ సైజు విషయంలో జాగ్రత్తలు వహించాలని ఆమె సూచించారు. విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్‌ను సకాలంలో అందించేందుకు అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐకెపి ఎపిఎం, సిసిలు ఉన్నారు.

## రైతులు సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి : మండల వ్యవసాయ అధికా రాగమ్మ

**మొయినాబాద్, మే28,ప్రభాతవార్త :** వచ్చే వానకాలం సీజను విత్తనాలు రైతులకు 60శాతం సబ్సిడీపై పచ్చిరొట్టె విత్తనాలు జనుముల అందుబాటులో ఉన్నాయని జనుములు 90 క్వింటలు ప్రస్తుతం అదుబాటులో ఉన్నాయని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రాగమ్మ అన్నారు. మంగళవారం వ్యవసాయ అధికారి రాగమ్మ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సిపిసిఎస్ ప్రాథమిక వ్యవసాయ కో ఆపరేటివ్ సొసైటీ నందు సమావేశాన్ని నిర్వహించి రైతులతో మాట్లాడుతూ వచ్చే వానాకాలం పచ్చిరొట్టె విత్తనాలు జనుముతో 60శాతం సబ్సిడీపై అందజేస్తున్నారని రైతులు ఈ చక్కటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మండలంలోని జనములో 90క్వింటాలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయని వీటిని రైతులు వారివారి రైతు కేంద్రాల వద్ద రైతు వేదికల వద్ద రైతు వేదికల మద్ద అందుబాటులో ఉంటాయని తెలియజేశారు. 40 కిలోల బ్యాగు సబ్సిడీ పోను 1448 రూపాయలు మండలంలోని మండలం లోని అన్ని గ్రామాల రైతులు మీ రైతు వేదికల దగ్గర పర్మిట్ గురించి పిఎసిఎస్ వద్ద జనుముల విత్తనాలు తీసుకోగలరని తెలిజేశారు. మండలంలోని రైతు వేదికల దగ్గరకు వెళ్లి పట్టాదారు పాసుబుక్ మరియు ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకుని పిఏసిఎస్ దగ్గర విత్తనాలు తీసుకోగలరని తెలియజేశారు. ఈ విత్తనాల సబ్సిడీ పంపిణీ మే 29 బుధవారం రోజు నుంచి పంపిణీ చేస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు వ్యవసాయ అధికారి తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌ఫామ్ పంట సాగుపై రైతులకు అవగాహన



**తలకొండపల్లి, మే28,ప్రభాతవార్త :** తలకొండపల్లి రైతు వేదికలో అయిల్‌ఫామ్ పంట సాగుపై రైతులకు అవగాహన మరియు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా ఉద్యాన శాఖ అధికారి ఉషారాణి అలాగే ఆయిల్‌ఫామ్ జిల్లా ఏరియా మేనేజర్ ప్రమోద్ పాల్గొన్నారు. ముందుగా ఉద్యాన అదికారి మాట్లాడుతూ ఆయిల్‌ఫామ్ పంట ప్రాధాన్యత అలాగే ప్రభుత్వం ఇచ్చేటువంటి రాయితీలు అనగా మొక్కలపై 90శాతం సబ్సిడీ డ్రిప్పుపై 80 నుంచి 100శాతం సబ్సిడీ మరియు మెయింటెనెన్స్ ఎకరానికి 4200 రూపాయలు నాలుగు సంవత్సరాల వరకు ఇవ్వడం జరుగుతుందని వివరించారు. ప్రభుత్వం ఇచ్చేరాయితీలను సద్వినియోగం చేసుకోవాలని అలాగే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను ఇచ్చేటువంటి ఆయిల్‌ఫామ్ పంటను పండించి రైతులు ఆర్థికంగా ఎదరగాలని సూచించారు. ఆల్‌ఫామ్‌సాగులో యాజమాన్య పద్ధతులు అలాగే మెలుకువలు గుర్తించి రైతులకు పూర్తి అవగాహన కల్పించారు. ఈ సమాశానికి వివిధ గ్రామాల నుంచి రైతులు మరియు తలకొండపల్లి మండలం ఫీల్డ్ ఆఫీసర్ రుక్మిణి మరియు వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీనాథ్ అనిత, నిచత శ్రీలత విజయ నిచత ఫీల్డ్ అసిస్టెంట్లు శ్రీనివాస్ మరియు నవీణ్ తదితరులు హాజరయ్యారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



**తలకొండపల్లి, మే28,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండలం మాధాయపల్లి గ్రామానికి చెందిన శీలం నరేష్ భార్య సుశీల అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సిల్ శ్రీనివాస్ యాదవ్ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూమిని తెలియజేస్తూ 3000 వేల రూపాయలను ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హైమావతి రామస్వామి బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ బయ్య యాదయ్య సత్యంగౌడ్ మల్లేష్ భగఎన్‌శంకరయ్య శేఖర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు


రక్తదానం చేస్తున్న కల్వకుర్తి టీడీపీ కన్వీనర్ అండేకర్ యాదిలాల్

**ఆమనగల్లు, మే28, ప్రభాతవార్త:** ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీనటుడు నందమూరి తారకరామారావు పేదల పక్షపాతిగా సమాజంలో చిరస్థాయిగా నిలిచిపోయారని టీడీపీ కల్వకుర్తి తాలూకా కన్వీనర్, సీనియర్ న్యాయవాది అండేకర్ యాదిలాల్ అన్నారు. పాలనలో ఎన్టీఆర్ తీసుకువచ్చిన సంస్కరణలతో సమాజంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయని, పేదల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడారు. ఎన్టీఆర్ 101 జయంతి సంధర్భంగా నగరంలోని ఎన్టీఆర్ భవన్‌లో మంగళవారం యాదిలాల్ రక్తదానం చేశారు. అంతకు ముందు టీడీపీ నాయకులు గాజుల పద్మనాభం, పంచాక్షరి, ఇతరులతో కలిసి యాదిలాల్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దివంగత నేత ఎన్టీ ఆర్ బడుగు బలహీన వర్గాల ప్రజలకు చేసిన సేవలను స్ఫూర్తిగా తీసుకుని నేడు స్వచ్ఛంధంగా రక్తదానం చేసినట్లు యాదిలాల్ తెలిపారు.


ఎన్టీఆర్‌కు ఘన నివాళి అర్పిస్తున్న తెలుగు తమ్ముళ్ళు

**ఆమనగల్లు పట్టణంలో..**

దివంగత ఎన్టీఆర్ 101వ జయంతి సంధర్భంగా ఆమనగల్లు పట్టణంలో తెలుగు తమ్ముళ్ళు ఘన నివాళి అర్పించారు. పట్టణంలోని రాజీవ్ చౌరస్తాలో ఎన్టీఆర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసుకుని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ అమర్ హై అంటూ నినాదాలు చేశారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు కండె సత్యం, యాదయ్య, కండె భాస్కర్, జగన్, బాబా, పాండు, మహేందర్ తదితరులు ఉన్నారు.

**కేశంపేట మండల పరిధిలో..**

**కేశంపేట, మే 28, ప్రభాతవార్త** కేశంపేట మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మాజీ ముఖ్య మంత్రి దివంగత నందమూరి తారకరామారావు 101వ జయంతి వేడుకలను టిడిపి మండల అధ్యక్షుడు చక్క శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు పుట్నాల గణేష్ పుట్నాల పాండు పుట్నాల లింగం శ్రీను బైండ్ల జనార్దన్ మరియు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.


కేశంపేటలో ఎన్టీఆర్‌కు నివాళి అర్పిస్తున్న దృశ్యం

**మేడ్చల్‌లో..**

**మేడ్చల్, మే 28. ప్రభాతవార్త :** మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను మేడ్చల్‌లో ఆయన అభిమానులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని 44వ జాతీయ రహదారి పక్కన గల ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అభిమానం చాటు కున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్ గౌడ్, వాసు, వర్మ, మల్లేష్ గౌడ్, సత్యనారాయణ, శేఖర్, ప్రేమ్ దాస్, ఈశ్వర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.


మేడ్చల్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

## సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

**ఆమనగల్లు, మే28, ప్రభాతవార్త:** పంటల సాగులో రైతులు సేంద్రీయ ఎరువుల పద్ధతులను అవలంభించి అధిక దిగుబడులు పొందాలని స్థానిక వ్యవసాయాధికారిణి అరుణకుమారి తెలిపారు. పచ్చిరొట్టి విత్తనాల వినియోగంతో కలిగే ప్రయోజనాలు, వ్యవసాయరంగంలో అందుబాటులో ఉన్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంపై రైతులు ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకుని సాగును లాభసాటిగా మార్చుకోవాలని ఆమె సూచించారు. వచ్చే వర్షాకాలంలో సాగులో రైతులు అవలంభించవలసిన పద్ధతులపై అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. మండల వ్యవసాయాధికారిణి అరుణకుమారితోపాటు విస్తరణ అధికారులు గ్రామాల్లో పర్యటించి నేరుగా రైతులకు సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు. మంగళవారం మండల పరిధిలోని మంగళపల్లి, చింతలపల్లి, విఠాయిపల్లి గ్రామాల్లో అధికారులు పర్యటించారు. విత్తన ఎంపిక, లభ్యత, కోనేటప్పుడు పరిశీలించవలసిన పద్ధతులపై అవగాహన కల్పించారు. అలాగే పంట మార్పిండి, వేసవి దుక్కుల వలన లాభాలు, పచ్చిరొట్టితో కలిగే ప్రయోజనాలను రైతులకు అధికారులు వివరించారు. సాగులో ఎటువంటి అనుమానాలు నివృత్తి అయినా స్థానిక వ్యవసాయాధికారులను సంప్రదించాలని ఆమె సూచించారు. వ్యవసాయశాఖ సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడి పొందాలని అరుణకుమారి సూచించారు.

## రైతులు విత్తనాలు కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలి : ఎడిఎ


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎడిఎ శంకర్ రాథోడ్

**బొంరాస్‌పేట్,మే28,ప్రభాతవార్త :** బొంరాస్‌పేట్ మండలం బాపన్‌చెరువు తాండలో వానకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు విత్తన కొనుగోలు విషయం లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కార్యక్రమం ద్వార కొడంగల్ ఎడిఎ శంకర్ రాథోడ్ వివరించారు. ఎఈఓ రేణుక నాందార్‌పూర్, వడిచర్ల గ్రామాలలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 31వ తేది వరకు రైతులకు ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతులు విత్తనాలను కొనుగోలు చేసిన దుకాణం నుండి తప్పనిసరిగా రసీదును తీసుకోవడంతోపాటు లూజుగా ఉన్న సంచులలో ఉన్న విత్తనాలను రైతులు కొనుగోలు చేయరాదన్నారు. విత్తనాల ప్యాకెట్, బిల్లును పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరచుకోవాలి. వ్యవసాయశాఖ ద్వార గుర్తింపు పొందిన డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని వారు సూచించారు. ఎఈఓ రేణుక, హేమరెడ్డి, కార్యదర్శి కృష్ణ, రైతులు పాల్గొన్నారు

## ఉపాధి హామీ పని కలించాలని గ్రామపంచాయతీ ముందు ధర్నా

**యాచారం మే28,ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని తమ్మలోని గూడ గ్రామంలో ఉపాధి హామీ పనులు కల్పించాలని గ్రామపంచాయతీ ముందు మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కూలీలకు మద్దతుగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, సీనియర్ నాయకులు శీలం జంగారెడ్డి హాజరై య్యారు. ఈ సందర్భంగా తమ్మలోని గూడ గ్రామంలో రైతుల భూముల్లో పని చేయించుకోవడం లేదని పని లేదని గ్రామపంచాయతీ సెక్రటరీ ,ఫీల్డ్ అసిస్టెంట్ కూలీలకు చెప్పడంతో కూలీలు ఆందోళన చెందుతూ గ్రామంలో ప్రభుత్వ భూమి 90 ఎకరాలు ఉంది కాబట్టి ఆ భూమిలో పని కల్పించాలని పని లేకపోతే మేము ఎట్లా బ్రతకాలని కూలీలు గ్రామపంచాయతీ ముందు ధర్నాకు దిగారు. కూలీలకు మద్దతుగా ఆందోళనలో పాల్గొన్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, సీనియర్ నాయకులు జంగారెడ్డిలు మాట్లాడుతూ.. అధికారులకు ముందు చూపు లేకపోవడంతో కూలీలకు సరిగ్గా పనులు కల్పించ లేక కూలీలు ఇంటి కాడ ఉండి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పని కావాలని ఎన్ని సార్లు దరఖాస్తులు పెట్టిన పట్టించుకోవడం లేదని వారికి ఇష్టం వచ్చినా వారితో రెగ్యూలర్ పని చేయిస్తున్నారని కూలీలు వాపోయారని తెలిపారు. సెక్రెటరనిని ఈ విషయంపైన కూలీలు అడుగుతుండగానే మాట మార్చి కూలీలకు సరైన సమాదానం చెప్పకుండా జిపి నుండి వెళ్లిపోయాడని తెలిపారు. ఈ విషయంపైన ఎంపిడిఓ, ఎపిఓలతో ఫోన్ చేసి చెప్పడం జరిగిందని వారు పని కల్పిస్తామని మాట ఇవ్వడంతో ధర్నాను విరవించడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామంలో అందరికీ పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్ట రక్షణ కోసం కూలీల సమస్యలు పరిష్కారం కోసం రేపు ఇబ్రహీంపట్నంలో జరిగే జిల్లా సదస్సులో కూలీలందరూ పాల్గొని జయ ప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సుగుణమ్మ, ప్ర మీల లక్ష్మమ్మ, రాంరెడ్డి, నర్సింహ, యశోద, అంజమ్మ, వెంకటమ్మ, రాములమ్మ, రమాదేవిఉన్నారు.

## వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

**ఎంపిటిసి సభ్యులు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి**


గ్రామ పంచాయతీ బోర్ మోటార్ పరిశీలిస్తున్న ఎంపిటిసి

**కడ్తాల్, మే 28 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో వేసవి కాలంలో ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా గుర్లకుంట చెరువులో గల నీటి బోర్లను గ్రామ పంచాయతీ సెక్రెటరీతో కలిసి రంగారెడ్డి జిల్లా ఎంపిటిసిల సంఘం గౌరవ అధ్యక్షులు కడ్తాల్ ఎంపిటిసి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. వేసవి కాలంలో ప్రజలకు నీటిఎద్దడి లేకుండా చూడాలని సూచించారు. వర్షాకాలంలో చెరువు నిండి చెరువులో ఉన్న మోటార్ల చెడిపోతే మరమ్మతులకు వెళ్లడానికి దారిలేక తీవ్ర ఇబ్బంది అవుతుంది. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని ఎంపిటిసి (బోరు) మోటార్ల వద్దకు వెళ్లడానికి దారి ఏర్పాటు చేయిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బిచ్యనాయక్, మాజీ వార్డు సభ్యులు మల్లయ్య, బ్రహ్మచారి, మేస్త్రీ పాల్గొన్నారు.

## మైసిగండిలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్యేకపూజలు


ప్రజా ప్రతినిధులతో కలిసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్యేకపూజలు

**కడ్తాల్,మే 28 ప్రభాతవార్త :** మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ ఆలయానికి రాష్ట్ర మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, మండల ప్రజా ప్రతినిధులు చేరుకోగా, ఆలయ ప్రధాన అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు గావించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు శాలువాలతో ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో కడ్తాల్ జడ్పిటీసి దశరథ్‌నాయక్, వైస్ ఎంపిపి బావండ్లపల్లి ఆనంద్, రాష్ట్ర మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు గూడూరు నరసింహారెడ్డి, ఆలయ అర్చకులు, ఆయా మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయం నిర్మాణంకు విరాళం అందజేత

**చేవెళ్ల, మే 28 ప్రభాతవార్త :** చేవెళ్ల మండల పరిధిలోని తంగడిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయంకు రూ.4లక్షల విరాళం హైదరాబాద్ ప్రాంతానికి చెందిన సాయి ఆలయ నిర్వాహకులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ... ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు రావడం అభినం దనీయమని తెలిపారు. సాయి కుటుంబానికి దేవుడు ఎల్లవేవేళల సుఖసంతోషాలతో ఉండేలా చూడాలని భగవంతుని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రెండు మండలాల్లో ప్రారంభమైన రైతులకు అవగాహన కార్యక్రమాలు

**శామీర్‌పేట, మే 28, ప్రభాతవార్త**

శామీర్‌పేట, మూడుచింతలపల్లి (రెండు) మండలాల్లో రైతులకు అవగాహన కల్పించటానికి వేరువేరుగా ఆ మండలాల వ్యవసాయ అధికారులు సిహెచ్ రమేశ్, కృష్ణవేణిలు సమావేశాలు ఏర్పాటు చేసి విత్తనాల కొనుగోలు విషయంపై తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహనలు కల్పించారు. మంగళవారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్, బాబగూడ గ్రామాలలో రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తనాల కొనుగోలు విషయంపై అవగాహణ కల్పించారు. విత్తనాల కొనుగోలు విషయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలను మండల వ్యవసాయ అధికారి సిహెచ్ రమేశ్ వివరించారు. బూజుగా ఉన్న సంచులలోని విత్తనాలను కొనుగోలు చేయరాదని అన్నారు. రైతులు విత్తనం కొనుగోలు చేసినపుడు రశీదు తప్పనసరి తీసుకోవాలని సూచించారు. రశీదు విత్తన ప్యాకెట్ పంట కాలం పూర్తి అయ్యే వరకు భద్రంగ ఉంచుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా లైసన్స్ కల్గి ఉన్న ఆధీకృత డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. గడువు మీరిన విత్తనాలను కొనుగోలు చేయవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఓ రమేశ్ తో పాటు ఎఇఓ రవియాదవ్, ఆయా గ్రామాల రైతులు, సొసైటీ డైరక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

**మూడుచింతలపల్లి మండలంలో..ఎఒ.**

మూడుచింతలపల్లి మండలంలో రైతులకు విత్తన కొనుగోలు విషయంపై మండల వ్యవసాయ అధికారిణి కృష్ణవేణి సమావేశం నిర్వహించి అవగాహణ కల్పించారు. మంగళవారం మూడుచింతలపల్లి మండలంలోని లక్ష్మా పూర్, మూడుచింతలపల్లి, లింగాపూర్‌తండ గ్రామాలలో రైతు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. వ్యవసాయ శాఖ నుంచి గుర్తింపు పొందిన డీలర్ నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలని, రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. పంట పూర్తి వరకు విత్తనాల కొనుగోలు రశీదును జాగ్రత్తగ పెట్టుకోవాలని రైతులకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీరేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవం

**శామీర్‌పేట, మే 28, ప్రభాతవార్త** లక్ష్మాపూర్‌లో శ్రీరేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవం మంగళవారం ఘనంగ జరిగింది. మూడుచింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో శ్రీరేణుకా ఎల్లమ్మ తల్లి కల్యాణోత్సవం సందర్భంగ ముందుగా ఆలయ ప్రాంగణంలో యజ్ఞహోమం పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆ తరువాత శ్రీరేణుకా ఎల్లమ్మ తల్లి కల్యాణోత్సవం ఘనంగ జరిగింది. లక్ష్మాపూర్ గౌడ సంఘం వారి ఆధ్వర్యంలో కల్యాణోత్సవం, జాతర జరిగింది. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అన్నదాన కార్యక్రమాన్ని దాత సిహెచ్ శ్రీనివాస్ (కేబుల్) తండ్రి సత్తయ్యగౌడ్ నిర్వహించారు. సాయంత్రం బోనాలు అమ్మవారికి మహిళలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆ తరువాత ఘట్టం కార్యక్రమం జరిగింది. శ్రీరేణుకా ఎల్లమ్మ తల్లి కల్యాణోత్సవం, జాతర మహోత్సవంలో గౌడ సంఘం సభ్యులతో పాటు పలువురు భక్తులు కూడ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## ఎన్‌టిఆర్ జయంతి..నేతల నివాళి

**ఘట్‌కేసర్, మే 28, ప్రభాతవార్త:** తెలుగుజాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు ఎన్‌టిఆర్ అని మండల టిడిపి అధ్యక్షులు వేముల సంజీవగౌడ్ అన్నారు. ఘట్‌కేసర్ మండలంలో మంగళవారం మాజీ ముఖ్యమంత్రి-తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు 101వ జయంతిని నిర్వహించారు. ఈసందర్భంగా మండల టిడిపి అధ్యక్షులు సంజీవగౌడ్ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాళ వేసి ఘనంగా నివాళులు అర్పించి మిఠాయిలు పంపిణీ చేశారు. ఘట్‌కేసర్ అంబేద్కర్ చౌరస్తా, మర్రిపల్లిగూడ, బైపాస్-ఓఆర్ఆర్ చౌరస్తాలో ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా నివాళులు అర్పించి ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు సామల జగనోహ్మన్‌రెడ్డి, పాటి సురేందర్‌రెడ్డి, టి.మహేశ్, ఉడుతల మధుబాబు, జి.చంద్రయ్య, శిష్టా సూర్యనారాయణరావు, కొత్త బిక్షపతి గుప్త, బత్తుల మహేశ్‌గౌడ్, మద్ది రాముగౌడ్, పోలగోని సుభాష్‌గౌడ్, మేకల యాదయ్య, సోమని సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఆదర్శ పాఠశాల పనులను వేగవంతం చేయాలి

**పనులు పూర్తి కాకపోతే మెమోలు జారీ చేస్తాం : జ్యోతి పద్మ**


మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి జ్యోతి పద్మ

**పెద్దేముల్, మే 28, ప్రభాతవార్త:** అమ్మ ఆదర్శ పాఠశాల పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి, డిడబ్లుఓ జ్యోతి పద్మ ఆదేశించారు. మంగళవారం పెద్దేముల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో హెచ్ఎం, పంచాయతీ కార్యదర్శులు, సీసీలతోసమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి పద్మ మాట్లాడుతూ పాఠశాలల్లో ప్రాదాన్యత క్రమంలో గుర్తించిన పనులను తక్షణమేపూర్తి చేయాలని చెప్పారు. సమీక్ష సమావేశానికి హాజరుకాని మంబాపూర్, గొట్లపల్లి, గాజీపూర్, హన్మాపూర్, తింసాన్‌పల్లి, తదితర పాఠశాలలప్రదానోపాధ్యాయులపై ఆరా తీశారు. ఇప్పటి వరకు పనుల్లో పురోగతి లేని పలు పాఠశాలల హెచ్ఎంలు, సీసీలు, సెక్రటరీలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పనులు పూర్తి చేయకపోతే మెమోలు జారీచేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యంపిడిఓ జర్నప్ప, ఏఈ సిద్దార్థ, హెచ్ఎంలు నర్సింగ్‌రావు, మురళిమోహన్, నవీన్‌కుమార్, మల్లికార్జున్, సంగమేశ్వర్, శ్రీవాణి, భాగ్యలక్ష్మి, రమాదేవి, సభియా, పంచాయతీ కార్యదర్శులు మల్లికార్జున్, రమేష్, సంజీవ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## దుకాణ యజమానులు లైసెన్సులు రెన్యూవల్ తప్పనిసరి

**మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్**

**వికారాబాద్ రూరల్, మే 28, ప్రభాతవార్త** వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ఆయా దుకాణాల యజమానులు తమ లైసెన్సులను తప్పనిసరిగా రెన్యూవల్ చేసుకోవాలని వికారాబాద్ మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని దాదాపు 1280 దుకాణాలు ఉన్నాయన్నారు. ఇందులో 20శాతం వరకు మాత్రమే దుకాణ యజమానులు లైసెన్సులు రిన్యూవల్ చేసుకున్నారు. చాలా వరకు దుకాణ యజమానులు నిర్లక్ష్యం వహిస్తున్నారరన్నారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా రెన్యూవల్ చేసుకోవాలని నిబంధనలు ఉన్నాయన్నారు. రెన్యూవల్ చేసుకొకుంటే దుకాణాలలో ప్రకృతి విపత్తు ప్రమాదాలు జరిగితే ఇన్సురెన్స్ వచ్చే అవకాశాలు ఉంటాయని తెలిపారు. వికారాబాద్ మున్సిపల్లో చాలా వరకు వ్యాపారులు తమ షాపులకు లైసెన్స్‌లు రెన్యువల్ చేయలేక పోతున్నారని అన్నారు. ప్రమాదవశాత్తు దుకాణాలకు ఎలాంటి ప్రమాదం జరిగినా వారికి ఇన్సురెన్స్ వర్తించదన్నారు. దీంతో దుకాణ యజమానులు భారీగా నష్టపోయే ప్రమాదం ఉంటుందని తెలిపారు. ఇప్పటికైనా దుకాణ యజమానులు తమ లైసెన్సులను రెన్యువల్ చేసుకోవాలని సూచించారు.

## జూనియర్ అసిస్టెంట్ పై కేసు నమోదు

**మహిళా ఉద్యోగిని ప్రేమించమని వెంట పడి వేధిస్తున్న విషయంలో బాధితురాలు ఫిర్యాదుతో కేసు నమోదు**

**శామీర్‌పేట, మే 28, ప్రభాతవార్త** మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని లేబర్ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగి మరో విభాగంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగిని వెంట పడుతూ వేధిస్తున్న విషయంలో ఆ ఉద్యోగిపై మంగళవారం శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గల మేడ్చల్-మల్కాజ్‌గిరి కలెక్టరేట్‌లోని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న అజయ్ మరో విభాగంలో పనిచేస్తున్న మహిళా జూనియర్ అసిస్టెంట్‌తో గత కొంత కాలంగ ప్రేమించమని వెంట పడుతూ తనని వేధిస్తుండగ ఈ నెల 25న బాధితురాలు పోలీసులకు ఆ వ్యక్తిపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శామీర్‌పేట పోలీసులు జూనియర్ అసిస్టెంట్ అజయ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## అక్రమంగా గ్యాస్ నింపుతున్న వ్యక్తి అరెస్ట్

**-సిలిండర్లు పరికరాలు స్వాధీనం**

**ఘట్‌కేసర్, మే 28, ప్రభాతవార్త:** అక్రమంగా గ్యాస్ ఫిల్లింగ్ చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి సిలిండర్లను స్వాధీనం చేసుకున్నామని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు. ఘట్‌కేసర్‌లోని హీనా బ్యాంగిల్ స్టోర్‌లో పెద్ద గ్యాస్ సిలిండర్ల నుంచి చిన్న గ్యాస్ సిలిండర్లలోని గ్యాస్ నింపుతున్నారని ఘట్‌కేసర్ ఎస్ఐ డి.అశోక్‌కు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. బ్యాంగిల్‌స్టోర్ నిర్వహిస్తున్న సయద్ నుస్రత్ ఒస్మాన్ (48) డొమెస్టిక్ 19 కిలోల సిలిండర్ల నుంచి 3 కిలోల చిన్న సిలిండర్లకు అక్రమంగా ఏలాంటి భద్రతా పద్దతులు పాటించకుండా గ్యాస్ నింపి అధిక ధరలకు విక్రయిస్తున్నారని నిర్ధారించారు. అతన్ని అదుపులోకి తీసుకొని సిలిండర్లు, పరికరాలను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. భారత్‌గ్యాస్ కమర్షియల్ 4 సిలిండర్లు (14 కిలోలు), వీటిలో ఒక ఫుల్, 3 ఖాళీ సిలిండర్లు ఉన్నాయి. 13 చిన్న సిలిండర్లు (4 కిలోలు) వీటిలో ఒకటి ఫుల్ కాగా 12 ఖాళీగా ఉన్నాయి. ఒక కన్వర్షన్ మిషన్ పైపులను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈమేరకు పంచనామా నిర్వహించి సయద్ నుస్రత్ ఒస్మాన్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఘట్‌కేసర్ ఎస్ఐ సైదులు పేర్కొన్నారు.

## తుర్కపల్లిలో వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య

**తీసుకున్న అప్పు చెల్లించాలని వేధింపులతో..?**

**శామీర్‌పేట, మే 28, ప్రభాతవార్త** తుర్కపల్లి గ్రామానికి చెందిన రుద్రబోయిన మహేందర్ (35) తన స్క్రాప్ షాపులో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం ఉదయం శామీర్‌పేట మండలంలోని తుర్కపల్లిలో ఈ సంఘటన జరిగింది. జీనోమ్ వ్యాలీ పోలీసుల కథనం ప్రకారం తుర్కపల్లి గ్రామానికి చెందిన రుద్రబోయిన మహేందర్ (35) అనే అతను అదే తుర్కపల్లి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి వద్ద 2023సంవత్సరంలో ఆరు (6) లక్షల రూపాయలు అప్పుగ తీసుకున్నట్లు తెలిపారు. ఇందులో 4లక్షల70వేల రూపాయలు తిరిగి ఆయనకు కట్టినట్లు తెలిపారు. మిగతా డబ్బుల కోసం అప్పు ఇచ్చిన వ్యక్తి తిరిగి కట్టమని వేధించగ మనస్థాపంతో మంగళవారం ఉదయం 10గంటల సమయంలో మహేందర్ తన స్క్రాప్‌షాపులో దూలానికి నైలాన్ తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు జీనోమ్‌వ్యాలీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.